

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

రాజన్న సిరిసిల్ల

5★★★ జిల్లా వార్తలు

శనివారం 21 సెప్టెంబరు 2024

సమతుల ఆహారంపై అవగాహన కల్పించాలి 8

పచ్చని చెట్లపై గొడ్డలి వేటు 8

దిగుబడిపై దిగాలు

- అధిక వర్షాలతో పంట నష్టం 49.37 ఎకరాలు
- 33 శాతం లెక్కతో అంచనా
- చివరి దశకు వానాకాలం సాగు
- తెగుళ్లతో రైతుల్లో ఆందోళన



పత్తి చేనులో వర్షపు నీళ్లు (ఫైల్)

(ఆంధ్రజ్యోతి సిరిసిల్ల)

ప్రకృతి వైపరీత్యాలు అన్నదాతలను ఆందోళనకు గురి చేస్తున్నాయి. పంట వేసింది మొదలు చేతికొచ్చేవరకు కష్టాలు ఎదురవుతూనే ఉన్నాయి. ఇటీవల కురిసిన వర్షాలతో దిగుబడిపై వరి, పత్తి రైతులు దిగాలు చెందుతున్నారు. జిల్లాలో వానాకాలం సాగులో మొదట్లో రైతులు వర్షాభావ పరిస్థితులు ఎదుర్కొన్నారు. ఆ తరువాత వరుసగా కురుస్తున్న వర్షాలు ఆవేదనకు గురి చేస్తున్నాయి. తుఫాను ప్రభావంతో జిల్లాలో వరి పత్తి, పంటలు దెబ్బతిన్నాయి. నిబంధనల ప్రకారం 33 శాతం పంట దెబ్బతింటేనే పరిహారం కింద నివేదికలు ఇస్తారు. వ్యవసాయ అధికారులు ఆగస్టు, సెప్టెంబరులో తుఫాను ప్రభావంతో వారం రోజులపాటు కురిసిన వర్షాలకు సంబంధించిన పంట నష్టాలను క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. భారీ వరదలకు చెరువులు, కుంటలు మత్తడి దూకడం, వాగులు పొంగిపొర్లడంతో వరి, పత్తి చేన్లలోకి నీళ్లు చేరాయి. మొదట్లో ప్రాథమిక అంచనా వేసిన అధికారులు పూర్తి స్థాయిలో రైతు పేరు, దెబ్బతిన్న పంట పేరు వంటి వివరాల నివేదికలను ప్రభుత్వానికి పంపించారు. నష్టం తీవ్రత ఎక్కువగా ఉన్న పొలాల్లోని నీళ్లు పోయిన తర్వాత సర్వే చేసి నివేదికలు తయారు చేయడంపై రైతులు అసంతృప్తిని వ్యక్తం చేశారు. వ్యవసాయ అధికారులు మాత్రం ఆగస్టు 30 నుంచి సెప్టెంబరు 6 వరకు జరిగిన పంట నష్టంలో 119 మంది రైతులకు సంబంధించి 49.37 ఎకరాలు నష్టపోయినట్లు నివేదికలు అందించారు. ఇందులో వరి 111 మంది రైతులు 46.07 ఎకరాలు, పత్తి పంట 8 మంది రైతులు 3.30 ఎకరాలుగా అంచనా వేశారు. ప్రధానంగా వరి పంట ఎక్కువగా దెబ్బతిన్నట్లు నివేదికలు అందించారు. వరిలో చందుర్తి మండలంలో 9 మంది రైతులు 1.35 ఎకరాలు, రుద్రంగి 20 మంది రైతులు 8.20 ఎకరాలు, కోనరావుపేట 32 మంది రైతులు 9.24 ఎకరాలు, గంభీరావుపేట ఒక రైతు ఎకరం, వీర్నపల్లిలో 36 మంది రైతులు 18.30 ఎకరాలు, ముస్తాబాద్‌లో 9 మంది రైతులు 3.37 ఎకరాలు, తంగళ్లపల్లిలో నలుగురు రైతులకు సంబంధించి 2.21 ఎకరాలు నష్టపోయినట్లుగా నివేదించారు. పత్తి పంటలో రుద్రంగిలో ఏడుగురు రైతులు 3.20 ఎకరాలు, వీర్నపల్లిలో ఒక రైతుకు సంబంధించి 10 గుంటలు నష్టం జరిగినట్లు లెక్కలు వేశారు. ప్రధానంగా పరిహారం అంచనాలు వేసినా అధిక వర్షాలతో వరి, పత్తి పంటలకు తెగుళ్లు సోకి దిగుబడి తగ్గే పరిస్థితులు ఉండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. జిల్లాలో ఇప్పటికే పత్తి పంట ఎర్రబారి దిగుబడి తగ్గుతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వం తీసుకునే నిర్ణయం మేరకు పంటలు దెబ్బతిన్న రైతులకు పరిహారం అందనుంది.

వానాకాలం సాగు 2.32 లక్షల ఎకరాలు

జిల్లాలో వానాకాలం సాగులో 2.32 లక్షల ఎకరాల్లో వివిధ పంటలు వేసుకున్నారు. ప్రధానంగా వరి 1.80 లక్షల ఎకరాలు, పత్తి 49,332 సాగు చేశారు. పెసర 56.26 ఎకరాలు, కందులు 939 ఎకరాలు, ఇతర పంటలు 122 ఎకరాల్లో వేశారు. జిల్లాలో వానాకాలం సాగులో గంభీరావుపేట మండలంలో 19,036 ఎకరాలు, ఇల్లంతకుంట 37,209, ముస్తాబాద్ 23,060, సిరిసిల్ల 5352, తంగళ్లపల్లి 20,405, వీర్నపల్లి 7314, ఎల్లారెడ్డిపేట 20,881, బోయినపల్లి 20,044, చందుర్తి 21,346, కోనరావుపేట 22,535, రుద్రంగి 9342 ఎకరాలు, వేములవాడ 10,366, వేములవాడ రూరల్‌లో 15,150 ఎకరాల్లో సాగు చేశారు.



ఇసుక మేటలతో పత్తి చేను

ఫసల్ బీమా ఎప్పుడో?

జిల్లాలో వరి, పత్తి ప్రధాన పంటలుగా ఉండగా తరువాత మొక్కజొన్న, పెసర, కందులు, ఇతర పంటలు వేస్తున్నారు. ఏటా అకాల, వడగళ్ల వర్షాలు తుఫాను ప్రభావంతో జిల్లాలో రైతులు నష్టపోతూనే ఉన్నారు. రైతులకు బీమా సౌకర్యం లేకపోవడంతో ప్రభుత్వం అందించే పరిహారంపైనే ఆధారపడి ఉంటున్నారు. ఈ సంవత్సరం మార్చిలో జరిగిన పంట నష్టానికి జిల్లాలో 1036 మంది రైతులకు 1014 ఎకరాలకు సంబంధించి రూ.1,01,41,500 పరిహారాన్ని అందించారు. అందులో తంగళ్లపల్లి మండలంలో 348 మంది రైతులకు రూ. 35,46,750, గంభీరావుపేట 70 మంది రైతులకు రూ. 4,38,250, ముస్తాబాద్ 578 మంది రైతులు రూ .5514500, వీర్నపల్లిలో 40 మంది రైతులకు రూ 6,42,000పరిహారాన్ని అందించారు. పంట నష్టాల పరిహారం అందించే దిశగా ప్రభుత్వం మరోసారి ఫసల్‌బీమా యోజన పథకాన్ని అమలు చేయడానికి నిర్ణయించారు. గతంలో ప్రధాన మంత్రి ఫసల్‌బీమా యోజన పథకం అందించినా గత ప్రభుత్వం నిలిపివేసింది. ప్రస్తుతం మళ్లీ బీమా ప్రత్యేకతను గుర్తించిన ప్రభుత్వం పునరుద్ధరించడానికి నిర్ణయించ డంతో రైతులకు ఉపయోగకరంగా ఉంటుందని భావిస్తున్నారు. ఫసల్‌బీమాను కాంగ్రెస్ ప్రభుత్వం యాసంగి పంట నుంచి అమలు చేయనున్నట్లు తెలుస్తోంది. ఫసల్‌బీమా యోజనలో మండలాన్ని యూనిట్‌గా తీసుకొని నష్టాన్ని అంచనా వేసేవారు. ప్రస్తుతం జరుగుతున్న మార్పులతో యూనిట్‌గా అంచనా వేయలేకపోతున్నారు. గ్రామాలను యూనిట్‌గా తీసుకున్న లెక్కించడం కష్టంగా మారే వాతావరణ పరిస్థితులు ఉన్నాయి. ప్రభుత్వమే ప్రీమియం చెల్లిస్తామని చెబుతున్న క్రమంలో ఫసల్‌బీమా ఎప్పుడు వస్తుందోనని రైతులు ఎదురు చూస్తున్నారు.

టైడ్స్ వార్షిక సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా

తంగళ్లపల్లి, సెప్టెంబరు 20: తంగళ్లపల్లి మండలం మండేపల్లిలోని తెలంగాణ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డ్రైవింగ్ ఎడ్యుకేషన్ సొసైటీ వార్షిక సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. సంస్థ చైర్మన్‌గా వ్యవహరిస్తున్న కలెక్టర్ సందీప్ కుమార్ ఝా హాజరయ్యారు. ఈ సందర్భంగా టైడ్స్‌లో 2023 -24 ఆర్థిక సంవత్సరంలో ఆర్థిక లావాదేవీలు, ఎంత మంది శిక్షణ తీసుకున్నారు తదితర అంశాలపై చర్చించారు. గతేడాది మొత్తం 3772 మందికి శిక్షణ ఇచ్చామని టైడ్స్ ప్రిన్సిపాల్ తెలిపారు. 2024- 25 ఆర్థిక సంవత్సరంలో చేపట్టనున్న పనులపై అడిగి తెలుసుకున్నారు. అనంతరం పది తీర్మానాలు ప్రవేశపెట్టగా, 8 తీర్మానాలను ఆమోదించారు. ఈ సమావేశంలో టైడ్స్ ప్రిన్సిపాల్ దురై మురుగన్, సభ్యులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మిడ్‌మానేరు నుంచి నీటి విడుదల

బోయినపల్లి, సెప్టెంబరు 20: శ్రీరాజరాజేశ్వర (మిడ్ మానేరు) ప్రాజెక్టు నుంచి అన్నపూర్ణ రిజర్వాయర్‌కు 3200 క్యూసెక్కుల నీటి విడుదల కొనసాగుతోంది. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటిమట్టం 318 మీటర్లకు ప్రస్తుతం 316.91 ఉండగా, నీటి నిల్వ సామర్థ్యం 27.54 టీఎంసీలకు ప్రస్తుతం 24.78 టీఎంసీల మేర నిల్వ ఉంది.

అన్నపూర్ణ రిజర్వాయర్‌కు ఎత్తిపోతలు

ఇల్లంతకుంట, సెప్టెంబరు 20: ఇల్లంతకుంట మండలం అనంతగిరి సమీపంలోని అన్నపూర్ణ రిజర్వాయర్‌కు నీటి ఎత్తిపోలు కొనసాగుతున్నాయి. 3.5 టీఎంసీల సామర్థ్యం ఉన్న అన్నపూర్ణ రిజర్వాయర్ ప్రస్తుతం 3.01 టీఎంసీలకు చేరుకుంది. మధ్యమానేరు ద్వారా వచ్చిన 3200 క్యూసెక్కుల నీటిని ఒక పంపు ద్వారా ఎత్తిపోస్తుండగా, ఎగువన ఉన్న రంగనాయకసాగర్‌కు 3300 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

వయోవృద్ధుల పురస్కారానికి దరఖాస్తు చేసుకోవాలి

సిరిసిల్ల కలెక్టరేట్, సెప్టెంబరు 20 : వయోవృద్ధుల దినోత్సవం సందర్భంగా అక్టోబరు 1వ తేదీన అంతర్జాతీయ వయోవృద్ధుల పురస్కారాలను అందజేయనున్నామని, అర్హులు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా సంక్షేమాధికారి లక్ష్మీరాజం శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో వయోవృద్ధుల శ్రేమస్సు, సంక్షేమం కోసం విశిష్ట సేవలందిస్తున్న వయో వృద్ధులు, సంస్థలవారు ఈ నెల 25వ తేదీలోగా దరఖాస్తులను హైదరాబాద్‌లోని మల్కపేట్ నల్లగొండ క్రాస్‌రోడ్డులోని దివ్యాంగుల సంక్షేమ భవనంలో అందజేయాలని సూచించారు.

ముగ్గురు ఎస్సైల బదిలీ

సిరిసిల్ల క్రైం, సెప్టెంబరు 20: జిల్లాలోని పలు మండలాల ఎస్సైలను బదిలీ చేస్తూ ఎస్పీ అఖిల్ మహాజన్ శుక్రవారం ఉత్తర్వులు జారీచేశారు. తంగళ్లపల్లి ఎస్సై సుధాకర్‌ను తంగళ్లపల్లి నుంచి సీసీఎస్‌కు, గంభీరావుపేట ఎస్సై రాంమోహన్‌ను తంగళ్లపల్లికి, గంభీరావుపేట ఎస్సైగా శివకుమార్‌ను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

విద్యార్థులు చదువుపై దృష్టి సారించాలి

- డీఈవో రమేష్‌కుమార్



విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈవో

సిరిసిల్ల రూరల్, సెప్టెంబరు 20: విద్యార్థులు చదువుపై దృష్టి సారించాలని, పదోతరగతి విద్యార్థులు ఏకగ్రతతో చదివి 10 జీపీఏ సాధించాలని డీఈవో రమేష్‌కుమార్ అన్నారు. సిరి సిల్ల పట్టణంలోని శివనగర్ కుసుమ రామయ్య జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను శుక్రవారం తనిఖీ చేశారు. పాఠశాలలో ఉపాధ్యాయులు, విద్యార్థుల రికార్డులను తనిఖీ చేయడంతో పాటు విద్యార్థుల కోసం తయారు చేసిన మధ్యాహ్న భోజ నాన్ని పరిశీలించారు. అనంతరం తరగతి గదుల్లో పర్యటించారు.విద్యార్థులతో మాట్లాడి ఉపాధ్యాయుల విద్యా బోధనల గురించి విద్యా ర్థులను అడిగితెలుసుకున్నారు. పదో తరగతి చదువుతున్న విద్యార్థులతో మాట్లాడారు. ఈ సంవ త్సరం పదోతరగతి చదువుతున్న విద్యార్థులు 10 జీపీఏ సాధించే దిశగా చదువుపై దృష్టి సారించాలని సూచించారు. గతే డాది కంటే ఈ సారి ఉత్తీర్ణత శాతాన్ని పెంచే విధంగా ఉపా ధ్యాయులు కృషి చేయాలని కోరారు. ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ పాతూరి మహేందర్‌రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పాములు వచ్చే వరకు మీరేం చేస్తున్నారు?

- అడిషనల్ కలెక్టర్ ఖీమ్యానాయక్
- అధికారులు, సిబ్బందిపై ఆగ్రహం
- పాముకాటుకు గురైన విద్యార్థికి పరామర్శ

ఎల్లారెడ్డిపేట, సెప్టెంబరు 20:'సంక్షేమ పాఠశాలల్లోకి పాములు వచ్చేంత వరకు మీరేం చేస్తున్నారు? విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవు' అని అడిషనల్ కలెక్టర్ ఖీమ్యానాయక్ పాఠశాల అధికారులు, సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పాముకాటుకు గురై ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఇల్లంతకుంట మండలం గాలిపల్లి సంక్షేమ పాఠశాలలోని ఆరో తరగతి విద్యార్థి రమావత్ రోహిత్‌ను శుక్రవారం రాత్రి పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకున్నారు. పాముకాటు వేసే సమయంలో విద్యార్థి ఎక్కడ ఉన్నాడని అధికారులు, పాఠశాల సిబ్బందిని ప్రశ్నించారు. వర్షాకాలంలో పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచకపోవడంపై మండిపడ్డారు.విద్యార్థి పడుకునే చోటుకు నాగుపాము వచ్చి కాటు వేస్తే ఏం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.



విద్యార్థి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకుంటున్న అదనపు కలెక్టర్

విద్యార్థికి మెరుగైన వైద్యం

పాముకాటుకు గురైన ఇల్లంతకుంట మండలం గాలిపల్లి సంక్షేమ పాఠశాలలోని ఆరో తరగతి విద్యార్థి రమావత్ రోహిత్‌కు మెరుగైన వైద్యం అందిస్తామని అడిషనల్ కలెక్టర్ ఖీమ్యానాయక్ అన్నారు. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోహిత్‌ను శుక్రవారం రాత్రి పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. సారూ ఒక్కాగానొక్క కొడుకును బాగా చదివించాలని, సంక్షేమ పాఠశాలలో చేర్పిస్తే పాము కాటుకు గురయ్యాడని విద్యార్థిని తల్లి రజిత కన్నీళ్లు పెట్టుకుంది. ధైర్యంగా ఉండాలని వైద్యానికి అయ్యే ప్రతీ పైసా ప్రభుత్వం చెల్లిస్తుందని పేర్కొన్నారు. మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు. ఆయన వెంట బీసీ సంక్షేమ శాఖ అధికారి మనోహర్ రావు, తహసీల్దార్ రామచంద్రం, తదితరులు ఉన్నారు. అంతకు ముందు బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, నాయకుడు సుభాష్ విద్యార్థి రోహిత్‌ను పరామర్శించారు.



సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న అదనపు కలెక్టర్

వాకర్స్‌కు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు

వేములవాడ టౌన్, సెప్టెంబరు 20 : వేములవాడ పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయ సముదాయంలోకి వచ్చే వాకర్స్‌కు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటామని మున్సిపల్ చైర్‌పర్సన్ రామతీర్థపు మాధవిరాజు అన్నారు. వేములవాడ మండల పరిషత్ సముదాయాన్ని శుక్రవారం వాకింగ్ ట్రాక్‌పై మొరం పోయించారు. ఈ సందర్భంగా మాదవి మాట్లాడుతూ ఎంపీడీవో కార్యాలయం సముదాయంలోని వాకింగ్ ట్రాక్ కోసం పట్టణ వాకర్స్ అభ్యర్థన మేరకు మొరం ఏర్పాటు చేసి రోడ్డు రోలర్‌తో చదును చేయించినట్లు చెప్పారు. ప్రభుత్వ కార్యాలయాలకు వచ్చే ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకున్నామన్నారు. వాకర్స్ ట్రాక్ కోసం సుమారు రూ. 50 వేల నిధులతో మొరం పోయించినట్లు తెలిపారు. ట్రాక్‌కు ఇరువైపుల ఉన్న చెట్ల కొమ్మలను తొలగించి ఇబ్బందులు లేకుండా చేశామని వివరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సంపత్‌రెడ్డి, వైస్ చైర్మన్ బింగి మహేష్ తదితరులు ఉన్నారు.



వాకింగ్ ట్రాక్‌ను పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ మాధవి

వేములవాడలో భక్తుల సందడి

వేములవాడ కల్చరల్, సెప్టెంబరు 20: వేములవాడ రాజరాజేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం భక్తుల సందడి నెలకొంది. క్యూలైన్‌ల ద్వారా ఆలయంలోకి చేరుకున్న రాజన్నను దర్శించుకొని తరించారు. స్వామివారికి ప్రీతి పాత్రమైన కోడెమొక్కు చెల్లించుకున్నారు. అనుబంధ ఆలయాల్లో ప్రత్యేక, కుంకుమ పూజల్లో పాల్గొన్నారు.



ఆలయ ఆవరణలో భక్తులు

కట్టెల పొయ్యి.. నీళ్ల చారు మళ్లీ కనిపిస్తే చర్యలు

- ఉపాధ్యాయులపై కలెక్టర్ ఆగ్రహం
- ఆదేశాలతో సిలిండర్ల అందజేత
- ఇద్దరికి నోటీసులు - 'ఆంధ్రజ్యోతి' కథనానికి స్పందన





ఆగ్రహం వ్యక్తం చేస్తున్న కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా, పాఠశాలకు చేరిన సిలిండర్లు

ఎల్లారెడ్డిపేట, సెప్టెంబరు 20: కట్టెల పొయ్యిపై వంటలు, విద్యార్థులకు నీళ్ల చారుతో ఆహారం అందిస్తే కఠిన చర్యలు తప్పవని కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా హెచ్చరించారు. ఎల్లారెడ్డిపేట మండలంలోని ప్రభుత్వ పాఠశాలలు, అక్కపల్లి పాఠశాలలో కట్టెల పొయ్యి, విద్యార్థులకు నీళ్ల చారు అందిస్తుండడంపై 'విద్యార్థులకు నీళ్ల చారు', కట్టెల పొయ్యితో కష్టాలు' అనే శీర్షికన ఈ నెల 14, 19న 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనాలకు కలెక్టర్ స్పందించారు. శుక్రవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలతోపాటు అక్కపల్లిలోని ప్రభుత్వ ప్రాథమిక ఉన్నత పాఠశాలను తనిఖీ చేశారు. పాఠశాలల్లోని పరిసరాలు, మధ్యాహ్న భోజనం తయారీ, ఆహారం, ఉపాధ్యాయులు, విద్యార్థుల రికార్డులను పరిశీలించారు. కట్టెల పొయ్యిలపై ఎందుకు వంట చేస్తున్నారని నిర్వాహకులను ప్రశ్నించారు. సిలిండర్ల సరఫరా లేకపోవడంతో తప్పడం లేదని వారు పేర్కొన్నారు. స్పందించిన కలెక్టర్ వెంటనే సిలిండర్లను అందించాలని తహసీల్దార్ రామచంద్రంను ఆదేశించారు. మండల కేంద్రంలోని పాఠశాలకు ఐదు సిలిండర్లను పంపిణీ చేశారు. తరగతి గదుల్లోకి వెళ్లి విద్యార్థులకు పాఠాలు బోధించారు. గణితంపై ప్రశ్నలు వేసి సమాధానాలు రాబట్టారు. ప్రతీ విద్యార్థిపై ప్రత్యేక శ్రద్ధ వహించాని ఉపాధ్యాయులకు సూచించారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న జూనియర్ అసిస్టెంట్ సుధాకర్, ఉపాధ్యాయులు రాజమల్లు హాజరు కాకపోవడంతో చర్యలు తీసుకోవాలని డీఈవో రమేశ్‌కుమార్‌ను ఆదేశించారు. ముందస్తు సెలవు పత్రం లేకుండా విధులకు ఎలా డుమ్మా కొడుతారంటూ ఆగ్రహించారు. ఇద్దరికీ నోటీసులను జారీ చేశామని డీఈవో రమేశ్ పేర్కొన్నారు. అక్కపల్లి పాఠశాలకు కలెక్టర్ వచ్చారనే సమాచారంతో తల్లిదండ్రులు భారీ సంఖ్యలో చేరుకున్నారు. బడిలో కొంత కాలంగా విద్యార్థులకు నీళ్ల చారుతో భోజనం వడ్డించడంతో తినలేక అర్ధకాలితో అలమటిస్తున్నారని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. పిల్లలకు నాణ్యమైన భోజనం అందించే బాధ్యత లేదా? అంటూ హెచ్ఎం సాంబయ్యపైనా, మధ్యాహ్న భోజనం నిర్వాహకులపైనా కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. రుచికరమైన భోజనం అందించేలా చర్యలు తీసుకుంటామని కలెక్టర్ తల్లిదండ్రులకు హామీ ఇచ్చారు. బడిలో అసంపూర్తిగా ఉన్న పనులను వేగవంతం చేయాలని సంబంధిత శాఖ అధికారులను ఆదేశించారు. డీఈవో రమేశ్‌కుమార్, తహసీల్దార్ రామచంద్రం, ఎంపీడీవో సత్తయ్య, ఎంపీవో రాజు ఉన్నారు.

ఆంధ్రజ్యోతి CLASSIFIEDS

CHANGE OF NAME

NAGASAMUDRAM SRILATHA (Old) W/O. NAGASAMUDRAM CHANDRAMOULI, R/o. H.NO: 27-7/8/1, Shivaji nagar, Town & Mandal Raikal, Dist JAGITHYAL (T.G) Have changed my name as NAGASAMUDRAM LATHA W/o. CHANDRA MOULI

AJK-201587

CHANGE OF NAME

★ I, GADARULA BUGGAIAH S/O. LASMAIAH, R/O. H.NO. 1-2-32/1A, SHASTRI NAGARA, VEMULAWADA, RAJANNA SIRICILLA DIST. NOW I CHANGED MY NAME AS GAJARLA KOMURAIAH S/O. LASMAIAH

AJK-15935

3+2 స్కీం కలదు

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగినరీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధంలేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా / ఇతరత్రా నమ్మించబడిన / క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/ యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు.

పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.

మేనేజర్ - ఏడివిటి

ఆంధ్రజ్యోతిలో క్లాసిఫైడ్ ప్రకటనలకై సంప్రదించండి


కరీంనగర్ :- సెల్: 9703618691, 9985410640

జగిత్యాల :- సెల్ : 99854 11262

మెట్‌పల్లి :- సెల్ : 70131 42966

వేములవాడ, సిరిసిల్ల :- సెల్: 99854 11063

పెద్దపల్లి :- 95509 00238



చికిత్స పొందుతూ యువకుడి మృతి

ఇల్లందకుంట, సెప్టెంబరు 20: మండలంలోని మర్రివానిపల్లె గ్రామంలో బైక్ అదుపు తప్పి కింద పడిపోయిన యువకుడు చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పెద్దపల్లి జిల్లా కాల్వశ్రీరాంపూర్ మండలం మిర్జంపేట గ్రామానికి చెందిన మండ సురేష్ (35) జమ్మికుంట మండలంలోని కొత్తపల్లిలో ప్రైవేట్ కారు నడుపుతూ జీవనం కొనసాగిస్తున్నాడు. గురువారం సాయంత్రం కొత్తపల్లి నుంచి బైక్‌పై తన బంధువుల ఇంటికి ఇల్లందకుంట మండలంలోని మర్రివానిపల్లె గ్రామం మీదుగా వెళ్తున్నాడు. గ్రామ శివారులో బైక్ అదుపు తప్పి కింద పడ్డాడు. గమనించిన స్థానికులు 108 వాహనంలో వరంగల్ ఎంజీఎం తరలించారు. చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. సురేష్ తల్లి వీరమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రాజకుమార్ తెలిపారు.

పశువులను తరలిస్తున్న వ్యాన్ పట్టివేత



గోశాలకు తరలించిన పశువులు

చిగురుమామిడి, సెప్టెంబరు 20: మండలంలోని కొండాపూర్ గ్రామ శివారులో శుక్రవారం అక్రమంగా పశువులను తరలిస్తున్న వ్యాన్(టీజీ07 యూ 2943)ను పట్టుకున్నట్లు ఎస్సై బండి రాజేశ్ తెలిపారు. కొండాపూర్ గ్రామ శివారులో వాహనాలను తనిఖీ చేస్తుండగా ఓ వ్యాన్‌లో ఐదు ఎద్దులు, మూడు ఆవులు, రెండు దూడలు ఉన్నాయి. వ్యాన్ డ్రైవర్ సాధిక్ ఖురేషిని విచారించగా పశువులను హుస్నాబాద్ సంతలో కొనుగోలు చేసి హైదారా బాద్‌కు తరలిస్తున్నట్లు చెప్పాడని తెలిపారు. దీంతో అక్రమంగా పశువులను తరలిస్తున్న వ్యాన్‌ను సీజ్ చేసి, డ్రైవర్‌తో పాటు యజమాని సాజిద్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై చెప్పారు. పశువులను గ్రామంలో ఉన్న గోశా లకు తరలించామని తెలిపారు.

గీత కార్మికుడికి గాయాలు



గాయపడ్డ కుమారస్వామి

హుజూరాబాద్‌రూరల్, సెప్టెంబరు 20: మండలంలోని కాట్రపల్లి గ్రామానికి చెందిన తాడూరి కుమారస్వామి గురువారం ప్రమాదవశాత్తు తాటి చెట్టుపై నుంచి పడిపోవడంతో తీవ్ర గాయాలయ్యాయి. కుటుంబ సభ్యులు హుజూరాబాద్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఛాతి, కడుపు, భుజం భాగంలో తీవ్ర గాయాలయ్యాయి. పరిస్థితి విషమంగా ఉండడంతో వరంగల్ ఎంజీఎంకు తరలించారు.

మానసిక దివ్యాంగులకు తోడ్పాటునందించాలి



ప్రిన్సిపాల్‌కు చెక్కును అందజేస్తున్న నరహరి

తిమ్మాపూర్, సెప్టెంబరు 20: మానసిక దివ్యాంగులకు మనవంతుగా తోడ్పాటునందిస్తూ ఇతరులకు స్ఫూర్తి నివ్వాలని మధ్యప్రదేశ్ రాష్ట్ర పబ్లిక్ హెల్త్ డిపార్ట్‌మెంట్ ప్రిన్సిపాల్ సెక్రటరీ కమిషనర్ పరికిపండ్ల నరహరి అన్నారు. మండలంలోని మహాత్మానగర్‌లో స్వాతంత్ర్య సమరయోధుల ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మానసిక దివ్యాంగుల పాఠశా లను శుక్రవారం నరహరి సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉమ్మడి కరీంనగర్ జిల్లాతో పాటుగా ఇతర జిల్లాలో కూడా ఆలయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నిజమైనా సహాయార్థులకు సేవలు అందించాలనే లక్ష్యంతో ముందుకొస్తున్న తమ ఆధ్వర్యంలో నడుస్తున్న ఆలయ ఫౌండేషన్‌కు ఆర్థికంగా సహాయ, సహకారం అందిస్తున్న వారికి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా వాగేశ్వరి ఇంజనీరింగ్ కళాశాల కరస్పాండెంట్ శ్రీనివాస్‌రెడ్డి సహకా రంతో పాఠశాలకు సంబంధించిన సామగ్రి కోసం అవసరమైన 30వేల రూపాయల చెక్‌ను ప్రిన్సిపాల్ సతీష్‌కు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ఫౌండేషన్ సీఈవో తిట్ల రమేశ్, మిట్టపెల్లి రాజేందర్, సుగుర్తి జగదీశ్వరాచారి, కళ్యాణ్ చంద్రశేఖర్, ఉమేశ్వర్, పి రామ్ తదితరులు పాల్గొన్నారు.

బాలికను వేధించిన ఒకరి రిమాండ్


వీణవంక, సెప్టెంబరు 20: ఓ బాలికను లైంగికంగా వేధించిన ఫైనర్‌పై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ తోట తిరుపతి తెలిపారు. వీణవంక మండలానికి చెందిన బాలిక(11)ను వేధించడంతో పాటు అసభ్యకరంగా ప్రవర్తించిన వ్యక్తిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

















న్యూస్ బాక్స్

నియామకం



మధుజాన్సన్

కరీంనగర్ స్పోర్ట్స్, సెప్టెంబర్ 20: ఉమ్మడి జిల్లా జూనియర్ కళాశాలల క్రీడా సమాఖ్య (ఎస్‌జీఎఫ్) కార్యదర్శిగా గుమ్మడి మధు జాన్సన్ నియమితులయ్యారు. ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ కామర్స్ జూనియర్ కళాశాలలో ఫిజికల్ డైరెక్టర్‌గా పనిచేస్తున్న మధు జాన్సన్‌ను 2023-2024 సంవత్సరానికి క్రీడా సమాఖ్య కార్యదర్శిగా నియమిస్తూ జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి జి జగన్మోహన్‌రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా మధు జాన్సన్‌ను సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి, ప్రిన్సిపాల్ వి సత్యవర్ధన్‌రావు, వి ఆంజనేయరావు, బి మదన్‌మోహన్ రావు, ఎ నిర్మల, ఆల్ఫోర్స్ చైర్మన్ వి నరేందర్‌రెడ్డి, జీజేఎల్ అధ్యక్షుడు శశిధర్‌శర్మ, ఒలింపిక్ సంఘ అధ్యక్ష, కార్యదర్శులు నందెల్లి మహిపాల్, గసిరెడ్డి జనార్దన్‌రెడ్డి అభినందించారు.

దరఖాస్తుల ఆహ్వానం

సైదాపూర్, సెప్టెంబరు 20 : సైదాపూర్ మోడల్ స్కూల్‌లో ఖాళీగా ఉన్న రసాయనశాస్త్రం అధ్యాపక పోస్ట్ (పీజీటీ- కెమిస్ట్రీ) నియామకానికి అర్హులైన అభ్యర్థుల నుంచి(హెచ్ బీటీ) దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బండారి సంపత్‌కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు సంబంధిత సబ్జెక్టులో పోస్ట్ గ్రాడ్యుయేషన్, బీఈడీ చేసి టెట్ క్వాలిఫై అయి ఉండాలని పేర్కొన్నారు. ఎంపికైన అభ్యర్థులకు బోధన ఆధారంగా గరిష్ఠంగా 18,200 రూపాయల వేతనం ఉంటుందని పేర్కొన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు వివరాలకు బండారి సంపత్‌కుమార్ 9014964242 నంబరులో సంప్రదించాలని సూచించారు.

పెరటి కోళ్ల పెంపకంతో అదనపు ఆదాయం



లబ్ధిదారులకు పెరటి కోళ్లను పంపిణీ చేస్తున్న డీన్ దాసరి శ్రీనివాస్

రామడుగు, సెప్టెంబరు 20: వ్యవసాయానికి అనుబంధంగా పెరటి కోళ్ల పెంపకం చేపట్టి అదనపు ఆదాయం పొందాలని కోరుట్ల వెటర్నిరి కాలేజ్ డీన్ డాక్టర్ దాసరి శ్రీనివాస్ అన్నారు. మండలంలోని షానగర్, శ్రీరాములపల్లి, రామడుగు గ్రామాల్లోని వందమందికి శుక్రవారం పీవీఎన్ఆర్ వెటర్నరి యూనివర్సిటీ కోరుట్ల వెటర్నరి కాలేజ్ ఆధ్వర్యంలో షెడ్యూల్డ్ కులాల సబ్‌ప్లాన్‌లో భాగంగా ఎస్సీ లబ్ధిదారులకు పెరటి కోడి పిల్లలను పంపిణీ చేశారు. డీవీ ఏహెచ్‌వో కార్యాలయ ఏడీ డాక్టర్ వినోద్‌కుమార్, ప్రోగ్రాం కో ఆర్డినేటర్ రాంబాబు ఉన్నారు.

నలుగురు ఉపాధ్యాయులకు షోకాజ్ నోటీసులు

మానకొండూర్, సెప్టెంబరు 20: మండలంలోని వివిధ పాఠశాలలకు చెందిన నలుగురు ఉపాధ్యాయులకు జిల్లా విద్యాధికారి జనార్దన్‌రావు శుక్రవారం షోకాజ్ నోటీసులు జారీ చేశారు. మండలంలోని వెల్ది ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఈ నెల 19న మానకొండూర్, శంకరపట్నం మండలాలకు చెందిన తెలుగు భాషోపాధ్యాయ స్కూల్ కాంప్లెక్స్ సమావేశం ఉన్నందున తొమ్మిది గంటలకు హాజరు కావాలని ఆదేశాలు ఉన్నాయి. కాగా మండలంలోని మండలంలోని శ్రీనివాస్‌నగర్‌లోని కేజీబీవీ పాఠశాల ఉపాధ్యాయురాలు కే రాజేశ్వరీ, అన్నారం ఉన్నత పాఠశాలకు చెందిన ఉపాధ్యాయురాలు కే శ్రీవాణి, పచ్చునూర్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయురాలు జి అంబిక, ఈదులగట్టెపల్లి పాఠశాల ఉపాధ్యాయుడు కే యువరాజు 10.20గంటలకు హాజరయ్యారు. దీంతో వీరందరికి డీఈవో షోకాజ్ నోటీసులు జారీ చేసి రెండు రోజుల్లో సంజాయిషీ ఇవ్వాలని ఆదేశించారు.

సిధారెడ్డికి 'తెలంగాణ తెలుగు తేజం' జాతీయ పురస్కారం

● తెలంగాణ భాషకు పట్టం కట్టిన సిధారెడ్డి ● పెద్దపల్లి జిల్లా అడిషనల్ కలెక్టర్ శ్యాంప్రసాద్‌లాల్



నందిని సిధారెడ్డికి జాతీయ పురస్కారాన్ని అందజేస్తున్న అడిషనల్ కలెక్టర్ జీవి శ్యాంప్రసాద్‌లాల్, తదితరులు

కరీంనగర్ కల్చరల్, సెప్టెంబర్ 20 : ప్రముఖ కవి, రచయిత, తెలంగాణ సాహిత్య అకాడమీ తొలి చైర్మన్ డాక్టర్ నందిని సిధారెడ్డికి బుర్ర నరసమ్మ లింగారెడ్డి స్మారక 'తెలంగాణ తెలుగు తేజం' జాతీయ పురస్కారాన్ని శుక్రవారం కరీంనగర్‌లో అందజేశారు. వాగీశ్వరి డిగ్రీ కళాశాలలో తెలంగాణ తెలుగు భాషా సంరక్షణ సంఘం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పురస్కార గ్రహీత సిధారెడ్డి మాట్లాడారు. బాధలు-గాయాలే కవిత్వాన్ని పండిస్తాయన్నారు. మట్టి వాసనలే సాహిత్య ఊటలకు ప్రేరణలని. అమ్మానాన్నల దీవెనలే మన అస్తిత్వమని అన్నారు. జీవితంలో అనుభవించే కన్నీళ్లే సాహితీవేత్తలకు సిరా చుక్కలని పేర్కొన్నారు. కష్టాల లోతుల్లోంచి జీవిత సత్యాలుకవిత్వ రూపంలో ఉబుకు తాయని అన్నారు. ముఖ్య అతిథిగా హాజరైన పెద్దపల్లి జిల్లా అడిషనల్ కలెక్టర్ జీవి శ్యాంప్రసాద్ లాల్ మాట్లాడుతూ సమాజహితం కోరే సాహితీవేత్తలు తమ రచనలతో ప్రజలను మేల్కొలుపుతూ నిస్వార్థంగా అక్షర సేద్యం చేస్తున్నారని అన్నారు. సిధారెడ్డి నిస్వార్థ నిరాడంబర నిక్కచ్చి జీవితం నేటి యువతకు దారి దీపంగా నిలుస్తుందని కొనియాడారు. తన అమ్మానాన్నల పేరిట జాతీయస్థాయి పురస్కారం అందిస్తున్న డాక్టర్ మధుసూదనరెడ్డిని అభినందించారు. కార్యక్రమంలో నేటి నిజం దినపత్రిక సంపాదకుడు బైస దేవదాసు, విమర్శకుడు, రచయిత దాస్యం సేనాధిపతి, సాహితీ గౌతమి అధ్యక్షుడు నంది శ్రీనివాస్ సంస్థ అధ్యక్షుడు, పురస్కార ప్రదాత డాక్టర్ బుర్ర మధుసూదన్‌రెడ్డి పాల్గొన్నారు.

కుల గణన తర్వాతనే వర్గీకరణ జరగాలి



అభివాదం చేస్తున్న బేడబుడిగ జంగాల హక్కుల పోరాట సమితి నాయకులు

సుభాష్‌నగర్, సెప్టెంబరు 20 : కుల గణన చేసిన తరువాతనే వర్గీకరణ జరగాలని తెలంగాణ బెడ బుడగ జంగాల హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు సిరపాటి వేణు డిమాండ్ చేశారు. శుక్రవారం నగరంలోని ప్రెస్‌భవన్‌లో రాష్ట్రస్థాయి సమా వేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సిరపాటి వేణు మాట్లాడారు. మాల మాది గలతో కలపకుండా బెడ బుడగ జంగాల ఉప కులాలను ఏ జాబితాలో చేర్చాలని, తమకు ఐదుశాతం రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఎస్సీ ఉపకులాలకు కార్పొరేషన్ ఏర్పాటు చేస్తామని కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మెనిఫెస్టోలో పేర్కొందన్నారు. దానిని అమలు చేయాలని, చైర్మన్‌గా బెడ బుడగ జంగాలనే నియమించాలని, పదివేల కోట్ల రూపాయల నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. అంబేద్కర్ అభయహస్తం పేరుతో రూ. 12లక్షలు ఇస్తామని ప్రకటించిందని, దానిని వెంటనే అమలు చేసి, 40శాతం బెడ బుడగ జంగాలకు కేటాయించాలన్నారు. ఎస్సీ వర్గీకరణ అమలు చేసిన తరువాత జనాభా దామాష ప్రకారం బేడ బుడగ జంగాలకు రాబోయే రోజుల్లో రెండు ఎమ్మెల్యే స్థానాలు కేటాయిం చాల న్నారు. బెడబుడగ జంగాలకు చెందిన వ్యక్తికి ఎమ్మెల్సీగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. బెడబుడగ జంగాలకు ఇందిరమ్మ ఇళ్లను అందించాలని, 50 సంవత్సరాలు నిండిన వారికి నెలకు రూ. 12వేల పింఛను ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమావే శంలో గౌరవాధ్యక్షుడు తురుపాటి లింగ య్య, ప్రధాన కార్యదర్శి పస్తం ఆంజనేయులు, రాష్ట్ర మహిళ అధ్యక్షురాలు పాశర్లపూడి లక్ష్మి, పస్తం పరశురాములు, డొక్క రాజేష్, పత్తి బాషశివ, మొటం నాగార్జున, మొటం రాములు తదితరులు పాల్గొన్నారు.

అప్పు ఇచ్చిన వ్యక్తి వేధింపులు..

మనస్తాపంతో ఒకరి ఆత్మహత్య

గన్నేరువరం, సెప్టెంబరు 20 : మండల కేంద్రంలో అప్పు ఇచ్చిన వ్యక్తి వేధింపులు భరించలేక ఓ వ్యక్తి ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్ఐ తాండ్ర నరేష్ తెలిపిన వివరాలు ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన మంగళారపు రాయమల్లు(55)కు ముగ్గురు కూతుళ్లు ఉన్నారు. ఇద్దరు కూతుళ్లకు వివా హం చేశాడు. రాయమల్లుకు ఆర్థిక ఇబ్బందులు తలెత్తడంతో అదే గ్రామానికి చెందిన పుల్లెల తిరు పతి వద్ద గతంలో లక్షా యాభైవేల రూపాయలను అప్పుగా తీసుకున్నాడు. అప్పు తీర్చాలని రాయ మల్లుపై తిరుపతి పలుమార్లు ఒత్తిడి తెచ్చాడు. ఈ క్రమంలో పుల్లెల తిరుపతి ఖాళీ బాండ్ పేపర్‌పైన రాయమల్లు సంతకం తీసుకున్నాడు. ఆ తరువాత ఖాళీ బాండ్ పేపర్‌లో రాయమల్లుకు చెందిన వ్యవసాయ భూమిని అమ్మినట్లుగా ఇందుకు ఐదు లక్షలు ముట్టినట్లుగా మరో లక్ష ఇస్తే భూమిని రిజిస్ట్రేషన్ చేయాలని బాండ్ పేపర్‌లో రాసుకున్నారు. రాయమల్లు తీసుకున్న లక్షా యాభైవేల అప్పును కొద్ది నెలల క్రితమే పుల్లెల తిరుపతికి చెల్లించాడు. అప్పు చెల్లించినా పుల్లెల తిరుపతి, అతడి బంధువులు పుల్లెల ఆంజనేయులు, దొగ్గలి అనసూర్య, దొగ్గలి ప్రదీప్ అనే రాయమల్లును భూమి రిజిస్ట్రేషన్ చేయమని వేధింపు లకు గురి చేశారు. దీంతో మనస్తాపానికి గురైన రాయమల్లు గురువారం రాత్రి తన ఇంటి ముందు ఉన్న రేకుల షెడ్‌లో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకు న్నాడు. ఖాళీ బాండ్ పేపర్‌పై సంతకం చేయించు కొని మోసం చేయడమే కాకుండా భూమి పట్టా చేయాలని పుల్లెల తిరుపతి, పుల్లెల ఆంజనేయులు, దొగ్గలి అనసూర్య, దొగ్గలి ప్రదీప్ వేధించడంతోనే తన భర్త ఆత్మహత్య చేసుకున్నట్లు రాయమల్లు భార్య రమ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ నరేష్ తెలిపారు.

శ్రీరాంసాగర్‌కు స్వల్పంగా వరద



జగిత్యాల, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి శుక్రవారం వరద నీరు స్వల్పంగా వస్తోంది. ఎస్సారెస్పీలోకి 8,895 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చి చేరుతోంది. ప్రాజెక్టులో ప్రస్తుతం 80.501 టీఎంసీల నీరు నిల్వ ఉంది. మిషన్ భగీరథ, సాగు నీటి కాలువలు, ఇతర అవసరాలకు ప్రాజెక్టు నుంచి 8,895 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు.

మహిళ ఆత్మహత్యా యత్నం

- అడ్డుకున్న హోంగార్డు

జమ్మికుంట, సెప్టెంబర్ 20: పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో శుక్రవారం ఓ మహిళ పురుగుల మందు తాగేందుకు ప్రయత్నించింది. అక్కడే విధుల్లో ఉన్న హోంగార్డు అడ్డుకోవడంతో ప్రాణపాయం తప్పింది. వీణవంక మండలం పోతిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన ఓ మహిళ అత్తింటి వారు వేధిస్తున్నారనే నెపంతో ఇటీవల మొగుళ్లపల్లి మండలం మొట్లపల్లి గ్రామంలోని తల్లిగారి ఇంటికి వెళ్లింది. తల్లి సైతం మందలించడంతో పురుగుల మందు డబ్బాతో జమ్మికుంట బస్టాండ్‌కు చేరుకుంది. ప్రయాణికులు చూస్తుండగానే పురుగుల మందు డబ్బా మూత తీసి తాగేందుకు ప్రయత్నించింది. అక్కడే విధులు నిర్వర్తిస్తున్న హోంగార్డు ఆమె వద్ద పురుగుల మందు డబ్బా లాక్కొని పోలీస్ స్టేషన్‌కు సమాచారం ఇచ్చాడు. అక్కడకు చేరుకున్న బ్లూకోల్ట్స్ సిబ్బంది మహిళను స్టేషన్‌కు తీసుకు వెళ్లి కౌన్సెలింగ్ ఇచ్చారు. అనంతరం మహిళ తల్లిని పిలిపించి అప్పగించారు.

భవనం పైనుంచి దూకిన కేజీబీవీ విద్యార్థిని

తీవ్ర గాయాలు



చికిత్స పొందుతున్న అశ్విత

వీర్నపల్లి/ఎల్లారెడ్డిపేట, సెప్టెంబరు 20: పాఠశాలలో ఉండలేనని రాజన్న సిరిసిల్ల జిల్లా వీర్నపల్లి మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో 8వ తరగతి చదువుతున్న విద్యార్థిని పర్లపల్లి అశ్విత శుక్రవారం రాత్రి పాఠశాల భవనం పైనుంచి దూకింది. ఈ సంఘటనలో విద్యార్థినికి తీవ్ర గాయాలయ్యాయి. బాలికను పాఠశాల సిబ్బంది హుటాహుటిన ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. వీర్నపల్లి మండలం జంజేరు గ్రామానికి చెందిన అశ్విత మండల కేంద్రంలోని కేజీబీవీలో ఆరో తరగతి నుంచి చదువుతోంది. కొంత కాలంగా తాను పాఠశాలలో ఉండనంటూ తల్లిదండ్రులకు చెబుతోంది. ఈ క్రమంలో శుక్రవారం తరగతులు ముగిసిన అనంతరం భవనం మొదటి అంతస్తు పైకి వెళ్లి కిందకు దూకింది. నడుముకు బలమైన గాయాలవడంతో ఎల్లారెడ్డిపేట ఆస్పత్రికి తరలించారు. అడిషనల్ కలెక్టర్ భీమ్యానాయక్ విద్యార్థిని ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. విద్యార్థినికి మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు. పాఠశాల, హాస్టల్‌లో విద్యార్థినులు ఏం చేస్తున్నారో గమనించకపోతే ఎలా అంటూ పాఠశాల ప్రత్యేక అధికారి, ఉపాధ్యాయులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సమాచారం అందుకున్న సీఐ శ్రీనివాస్‌గౌడ్, ఎల్లారెడ్డిపేట, వీర్నపల్లి ఎస్ఐ రమాకాంత్, ఎల్లాగౌడ్ వివరాలు తెలుసుకున్నారు. విద్యార్థి సంఘాల నాయకులు మాట్లాడుతూ జిల్లాలో వరుస సంఘటనలు చోటు చేసుకుంటున్నా అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు.

ఆన్‌లైన్ షాపింగ్‌లో మోసం

టీషర్ట్స్ బుక్ చేస్తే ఖాళీ బాక్స్



ఆన్‌లైన్‌లో వచ్చిన అట్టను చూపుతున్న బాధితుడు రహ్మాన్‌ఖాన్

ఇల్లందకుంట, సెప్టెంబరు 20 : అమెజాన్ ఆన్‌లైన్ షాపింగ్‌లో రూ. 548 విలువ చేసే టీషర్ట్స్ బుక్ చేస్తే వట్టికి స్టిక్కర్ బొమ్మ వేసి డెలివరీ చేసిన సంఘటన ఇల్ల ందకుంట మండలం సిరిసేడు గ్రామంలో గురువారం చోటు చేసుకుంది. బాధితుడు రహ్మాన్‌ఖాన్ తెలిపిన వివరాల ప్రకారం. రూ. 548 విలువ చేసే టీషర్ట్స్ బుక్ చేయగా వాటికి బదులుగా ఖాళీ వట్టికి స్టిక్కర్లు వేసి డెలివరీ చేశారు. తను చేసిన టీషర్ట్స్ ఇంత చిన్న పరిమాణంలో ఉంటాయాన్న అనుమానంతో ప్యాకెట్ విప్పలేదు. దీనిపై అమెజాన్ యాప్‌లో ఐటమ్ రిటర్న్ పెట్టాడు. కొరియర్ బాయ్ రావడంతో అతని ముందే ప్యాకింగ్ ఓపెన్ చేశాడు. అందులో స్టిక్కర్ బొమ్మ వచ్చిందని బాధితుడు ఆగ్రహం వ్యక్తం చేశారు. వినియోగదారుల ఫోరంలో కేసు వేయనున్నట్లు తెలిపాడు.

టీబీ నివారణపై అవగాహన



సనుగులను సందర్శించిన టీబి ఆలర్ట్ ఇండియా ఆర్గనైజేషన్

చందుర్తి, సెప్టెంబర్ 20: చందుర్తి మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంతో పాటు మల్యాల, సనుగుల సబ్ సెంటర్‌లో టీబీ నివారణపై శుక్రవారం ఆరోగ్య సిబ్బందికి టీబీ అలర్ట్ ఇండియా ఆర్గనైజేషన్ ఇంపాక్ట్ ప్రోగ్రామ్ జిల్లా అధికారి దండుబోయిన శ్రీనివాస్ అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచంలోనే అధిక సంఖ్యలో కేసులు మన ఇండియాలోనే నమోదు అవుతున్నాయన్నారు. దీని ద్వారా మరణాల సంఖ్య అధికంగా ఉందన్నారు. టీబీ అనే మహమ్మారిని ప్రజల నుంచి దూరం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణలో ఐదు జిల్లాలను ఎంపిక చేసిందని అందులో రాజన్న సిరిసిల్ల జిల్లా ఒకటని అన్నారు. టీబీ బారిన పడి ఆ వ్యాధిని జయించిన వారిని టీబీ చాంపియన్‌గా గుర్తించి వారికి శిక్షణ నిర్వహించి, వారి ద్వారా వ్యాధి నివారణకు చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సిహెచ్ ఓ శశికల, ఎంఎల్ హెచ్‌పిలు డాక్టర్ ఐశ్వర్య, నవీన్, సూపర్వైజర్ గంగాధర్, ఏఎన్ఎంలు రమాదేవి, పద్మ, మమత, ఆశ వర్కర్లు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

రేపు కరీంనగర్ హాఫ్ మారథాన్

3కె, 5కె,10కె,21కె విభాగాల్లో నిర్వహణ



కరీంనగర్ హాఫ్ మారథాన్ టీ షర్ట్‌లను ఓపెన్‌చేస్తున్న నిర్వాహకులు

కరీంనగర్ స్పోర్ట్స్, సెప్టెంబర్ 20: కరీంనగర్ రన్నర్స్ సైక్లిస్టుల సంఘం ఆధ్వర్యంలో ఈనెల 22న కరీంనగర్‌లో రెండవ ఎడిషన్ కరీంనగర్ హాఫ్ మారథాన్ నిర్వహించనున్నట్లు మారథాన్ కమిటీ అధ్యక్షుడు పసుల మహేశ్ తెలిపారు. శుక్రవారం సాయంత్రం అంబేద్కర్ స్టేడియంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మారథాన్ వివరాలను వెల్లడించారు.

రన్ ఫర్ హెల్త్, సే నో టు డ్రగ్స్ అనే నినాదంతోపాటు కరీంనగర్ ప్రజలకు ఫిట్‌నెస్‌పై అవగాహన ఆరోగ్యం లక్ష్యంగా హాఫ్ మారథాన్ నిర్వహిస్తున్నామని చెప్పారు. ఈ మారథాన్‌లో మూడు కిలో మీటర్లు, 5,10, 21 కిలో మీటర్ల విభాగాల్లో నాలుగు కేటగిరీలుగా నిర్వహిస్తున్నామని అన్నారు. జిల్లా యంత్రాంగం పోలీసు కమిషనరేట్, టూరిజంల ఆధ్వర్యంలో నిర్వహిసున్న ఈ మారథాన్‌లో పాల్గొనేందుకు ఇప్పటి వరకు 5వేల మంది తమ పేర్లను నమోదు చేసుకున్నారని తెలిపారు. వారిని మాత్రమే మారథాన్‌లో పాల్గొనేందుకు అనుమతిస్తామని చెప్పారు. అంబేద్కర్ స్టేడియం నుంచి ప్రారంభమై భగత్‌నగర్, కలెక్టరేట్, ప్రతిమ మల్టీప్లెక్స్, తెలంగాణచౌక్, పద్మనగర్ మీదుగా ఎల్ఎండీ నుంచి తిరిగి అంబేద్కర్ స్టేడియం వరకు సాగుతుందని తెలిపారు. ఈ మారథాన్‌లో పాల్గొనే వారందరికి టీషర్ట్స్‌ను అందజేస్తామని మహేశ్ తెలిపారు. ఆదివారం ఉదయం 5 గంటల నుంచి మారథాన్ ప్రారంభమవుతుందని, పురుషులు, మహిళలు పాల్గొనే ఈ మారథాన్‌లో 21కె విభాగంలో ఫస్ట్ ప్రైజ్ 10వేలు, సెకండ్ ప్రైజ్ 7వేల 500, థర్డ్ ప్రైజ్‌గా 5వేలు, 10కె విభాగంలో ఫస్ట్ ప్రైజ్ 7వేలు, సెకండ్ ప్రైజ్ 5వేలు, థర్డ్ ప్రైజ్‌గా 3వేలతో పాటు మెమోంటోలు అందజేయడం జరుగుతుందని అన్నారు. అనంతరం టీషర్ట్స్‌ను విడుదల చేశారు. సమావేశంలో జిల్లా క్రీడాధికారి శ్రీనివాస్‌గౌడ్, మార్కెటింగ్ డిడి పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ వర్గీకరణ క్రిమిలేయర్‌కు వ్యతిరేకంగా పోరాటం



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎస్సీ ఎస్టీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి నాయకులు

సుభాష్‌నగర్ ; సెప్టెంబరు 20: ఎస్సీ, ఎస్టీ, వర్గీకరణ, క్రిమిలేయర్ అమలుకు వ్యతిరేకంగా పోరాటం చేయాలని ఎస్సీ, ఎస్టీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి జాతీయ చైర్మన్, దళిత బహుజనపార్టీ జాతీయ అధ్యక్షుడు, సుప్రీంకోర్టు న్యాయవాది వడ్లమూరి కృష్ణ స్వరూప్ పిలుపునిచ్చారు. శుక్రవారం నగరంలోని ప్రెస్‌భవన్‌లో రాష్ట్ర అధ్యక్షుడు గవ్వల శ్రీకాంత్‌తో కలిసి ఏర్పాటుచేసిన విలేకరుల సమా వేశంలో ఆయన మాట్లాడారు. నరేంద్రమోదీ ప్రభుత్వం, కాంగ్రెస్, మనువాద పార్టీలు కలిసి కుట్రలు చేస్తున్నాయన్నారు. సుప్రీంకోర్టులో వందకుపైగా రివ్యూ పిటిషన్‌లు పెండింగ్‌లో ఉండగా రేవంత్ సర్కార్ వర్గీకరణకు కమిటీ వేయడం సిగ్గుచేటన్నారు. కమిటీని వెంటనే రద్దుచేయాలన్నారు. సెప్టెంబరు 30న ఛలో హైదరాబాద్ సచివాలయం ముట్టడికి తరలి రావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో నాయకులు పసుల రాజలింగం, ఆర్ల రమేష్, యనమల మంజుల, బద్దం డేనియల్, రాగి రాజేష్, తీగల శేఖర్, శ్రీని వాస్, నిచ్చికోల రాంచందర్, లింగాల జలపతి, చిప్పరి కరుణాకర్, పిట్ల ఈశ్వర్, దుగుట రాజు తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

ఫిట్స్‌తో ఇంటర్ విద్యార్థి మృతి

మడికొండ, సెప్టెంబరు 20: ఫిట్స్ రావడంతో ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ ఇంటర్మీడి యేట్ విద్యార్థి మృతి చెందాడు. హనుమకొండ జిల్లా మడికొండ ఇన్‌స్పెక్టర్ పుల్యాల కిషన్ తెలిపిన వివరాల ప్రకారం.. కరీంనగర్ జిల్లా చిగురు మామిడి మండలం నవాబుపేటకు చెందిన బుర్ర మల్లేశం కుమారుడు బుర్ర రామ్‌చరణ్(18) కాజీపేట మండలం భట్టుపల్లిలోని సిగ్మా జూనియర్ కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. శుక్రవారం ఉదయం కళాశాల ఉపాధ్యాయుడు ముద్దం సంతోష్ ఫోన్‌చేసి తమ కుమారుడికి ఫిట్స్ రావడంతో ఆస్పత్రికి తరలించగా చికిత్సపొందుతున్నాడని ప్రస్తుతం అతడి ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉందని వెంటనే ఎంజీఎం ఆస్పత్రికి రావాలని తెలిపాడు. ఆస్పత్రికి చేరుకున్న తమకు అప్పటికే కుమారుడు మృతి చెందాడని తెలిపారు. మృతుడి తండ్రి మల్లేశం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ కిషన్ తెలిపారు.

గుర్తు తెలియని వ్యక్తి..

ధర్మపురి, సెప్టెంబరు 20: ధర్మపురి మండలంలోని రాయపట్నం సమీపంలో రోడ్డు పక్కన పడి ఉన్న గుర్తు తెలియని వ్యక్తిని జగిత్యాల ఆసుపత్రికి తరలించగా శుక్రవారం సాయంత్రం మృతి చెందినట్లు ఎస్ఐ గంగుల మహేష్ తెలిపారు. సదరు వ్యక్తి 20 రోజుల నుంచి మతి స్థిమితం కోల్పోయి గ్రామంలో తిరుగుతుండేవాడు. 10 రోజుల క్రితం గ్రామ శివారులో రోడ్డు పక్కన పడి ఉండగా 108లో జగిత్యాల ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించారు. సదరు వ్యక్తి మాట్లాడలేని స్థితిలో ఉండడంతో అతని వివరాలు తెలియలేదు. జగిత్యాల ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. రాయపట్నం గ్రామపంచాయతీ కార్యదర్శి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. మృతి చెందిన వ్యక్తి కుటుంబ సభ్యుల వివరాలు తెలిస్తే పోలీసులకు తగు సమాచారం ఇవ్వాలని ఆయన కోరారు.

జ్వరంతో ఆరేళ్ల బాలుడి..

రాయికల్, సెప్టెంబరు 20 : రాయికల్ పట్టణంలోని ఇందిరానగర్ కాలనీకి చెందిన రాస మనీష్ (6) అనే ఆరేళ్ల బాలుడు జ్వరంతో శుక్రవారం మృతి చెందినట్లు స్థానికులు తెలిపారు. ఇందిరానగర్ కాలనీకి చెందిన రాజశేఖర్-లాస్య దంపతులకు ఇద్దరు కవల పిల్లలు. నాలుగు రోజుల నుంచి ఇద్దరికీ జ్వరం రావడంతో జగిత్యాలలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స అందిస్తున్నారు. శుక్రవారం పెద్ద కుమారుడు మనీష్‌కు తీవ్ర జ్వరం రావడంతో మెరుగైన చికిత్స నిమిత్తం జగిత్యాల నుంచి కరీంనగర్‌లోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు.

బావిలోపడి రైతు..

కరీంనగర్ క్రైం, సెప్టెంబరు 20 : కరీంనగర్ రూరల్ మండలం నగునూర్‌కు చెందిన బోనగిరి సత్తయ్య(51) ప్రమాదవశాత్తుగా వ్యవసాయబావిలో పడి మృతి చెందాడు. కరీంనగర్ రూరల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సత్తయ్యకు ఫిట్స్ వ్యాధి ఉండగా మందులు వాడుతున్నాడు. గురువారం తన వ్యవసాయబావి వద్దకు సత్తయ్య, అతడి భార్య వెళ్లారు. సాయంత్రం నాలుగు గంటలకు అతని భార్య ఇంటికి వెళ్లగా సత్తయ్య బావి వద్ద విద్యుత్ మోటార్ బంద్ చేసేందుకు వేచి ఉన్నాడు. ఈ సమయంలోనే మూర్ఛవచ్చి ప్రమాదవశాత్తు జారి బావిలోపడి మృతిచెంది ఉంటాడని మృతుడి భార్య పోలీసులకు ఫిర్యాదు చేసింది. గురువారం సాయంత్రం సత్తయ్య ఇంటికి రాకపోవటంతో బావి వద్ద వెతకగా అతని చెప్పులు కనిపించినట్లు ఫిర్యాదులో పేర్కొంది. శుక్రవారం ఉదయం బావిలోని నీటిని మోటార్ ద్వారా తోడగా బావిలో సత్తయ్య మృతదేహం కనపడింది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

అప్పుల బాధతో ఒకరి ఆత్మహత్య

కోనరావుపేట సెప్టెంబరు 20 : కోనరావుపేట మండలం మర్తనపేట గ్రామానికి చెందిన కప్పు భాను (50)అనే వడ్రంగి అప్పుల బాధతో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసుల వివరాల ప్రకారం.. మర్తన్‌పేటకు చెందిన భాను సుమారు రూ.5 లక్షల వరకు వెచ్చించి కట్టె కోత మిషన్ కొనుగోలు చేశాడు. కట్టెపని దొరకకపోవడం, మిషన్‌కోసం చేసిన అప్పుల మిత్తి పెరగడంతో మనోవేదన గురయ్యా డు. ఈ క్రమంలోనే అప్పులు ఎలా తీర్చాలో తెలియక గురువారం రాత్రి దూలానికి ఉరేసుకున్నాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు కోనరావుపేట ఎస్సై రాజశేఖర్ రెడ్డి తెలిపారు. మృతుడికి భార్య బాలవ్వ, కుమారులు వెంకటేష్, భూమేష్ ఉన్నారు.

కారును ఢీకొన్న లారీ

పెద్దపల్లి టౌన్, సెప్టెంబరు 20 : జిల్లా కేంద్రం లోని కూనారం క్రాస్ రోడ్డు వద్ద కారును లారీ ఢీకొనడంతో భారీగా ట్రాఫిక్ జామ్ అయింది. ఈ ప్రమాదంలో కారు ముందు భాగం ధ్వంసం కాగా, ఎవరికీ ఎలాంటి గాయాలు కాలేదని స్థానికులు తెలిపారు. సంఘటన స్థలానికి ట్రాఫిక్ పోలీసులు చేరుకొని ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు.

సిద్దిపేట సీఐ లక్ష్మిబాబు సస్పెన్షన్

కరీంనగర్ క్రైం, సెప్టెంబరు 20 : గతంలో కరీంనగర్‌లో సీఐగా పనిచేసిన సమయంలో ఒక కేసుకు సంబంధించి వచ్చిన ఆరోపణలపై విచారణ అనంతరం ప్రస్తుత సిద్దిపేట సీఐ లక్ష్మిబాబును సస్పెండ్ చేస్తూ శుక్రవారం నార్త్‌జోన్ ఐజీ కార్యాలయం నుంచి ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఏడాది కిందట కరీంనగర్‌లోని పలు ఫైనాన్స్‌లపై పోలీసులు దాడులు నిర్వహించి నగదు, రికార్డులను స్వాధీనం చేసుకుని కేసులు నమోదు చేశారు. ఈ సమయంలో కరీంనగర్‌లోని ఒక ఫైనాన్స్‌లో పోలీసుల దాడుల్లో లభ్యమైన డబ్బుల్లో 10 లక్షల నగదు తేడా రావటంతో ఈ వ్యవహారంపై సంబంధితులు ఐజీకి ఫిర్యాదు చేసినట్లు సమాచారం. ఈ మేరకు ఐజీ ఆదేశాలతో కరీంనగర్ పోలీస్‌కమిషనర్ విచారణ నిర్వహించి, నివేదిక అందజేయగా ఉన్నతాధికారులు సస్పెన్షన్ వేటు వేశారని తెలిసింది.

గల్లంతైన వ్యక్తి ఆచూకీ లభ్యం

జగిత్యాల క్రైం, సెప్టెంబరు 20 : జగిత్యాల జిల్లా కేంద్రంలోని చింతకుంట చెరువులో గురువారం ఒకరు గల్లంతుకాగా శుక్రవారం ఆచూకి లభ్యమైంది. ఆదిలాబాద్ జిల్లా ఊట్నూరుకు చెందిన సంపంగి శ్రీనివాస్(24) కొన్ని రోజులుగా జగిత్యాలలో తాపీ మేస్త్రీగా పనిచేస్తున్నాడు. గురువారం సాయంత్రం చింతకుంట చెరువులోకి ఈత కోసం వెళ్లి బయటకు రాకపోవడం స్థానికులు గమనించి డయల్ 100కు సమాచారం ఇచ్చారు. శుక్రవారం పోలీసులు జాలర్లతో గాలింపు చర్యలు చేపట్టడంతో మృతదేహం లభ్యం కాగా కేసు నమోదు చేశామన్నారు.

సమతుల ఆహారంపై అవగాహన కల్పించాలి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ సందీప్‌కుమార్ ఝూ

సిరిసిల్ల కలెక్టరేట్, సెప్టెంబరు 20: గర్భిణులు, బాలింతలు, బాలికలు సమతుల ఆహారం తీసుకునేలా అవగాహన కల్పించాలని సందీప్ కుమార్ ఝూ ఆదేశించారు. పోషణ్ మాసంపై జిల్లా సమీకృత కార్యాలయ సముదాయంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో స్త్రీ, శిశు సంక్షేమ శాఖ అధికారులతో శుక్రవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా వ్యాప్తంగా కొనసాగుతున్న ఎనిమియా నిర్ధారణ పరీక్షలపై అడిగి తెలుసుకున్నారు. ఇప్పటి వరకు ఎంతమందికి పరీక్ష చేశారనే వివరాలు తెలుసుకున్నారు. జిల్లాలో మొత్తం బాలికలు, గర్భిణులు, బాలింతలు కలిపి 34 వేల మంది ఉన్నట్లు, ఇప్పటి వరకు 17, 820 మందికి పరీక్షలు చేసినట్లు జిల్లా సంక్షేమ అధికారి లక్ష్మీరాజం కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ రక్త శాతం తక్కువ ఉన్న వారికి ఐరన్, కాల్షియం టాబ్లెట్లు ఇప్పించాలన్నారు. ఆకుకూరలు, బెల్లం ఖర్జూర తీసుకునేలా అవగాహన కల్పించాలని సూచించారు.

కిచెన్ గార్డెన్లు ఏర్పాటు చేయాలి

ప్రతీ అంగన్‌వాడీ కేంద్రం పరిధిలో లబ్ధిదారులందరిపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని, వారిని నిరంతరం పర్యవేక్షించాలని జిల్లా సంక్షేమ అధికారి లక్ష్మీరాజం ఆదేశించారు. స్థలం ఉన్న అంగన్‌వాడీ కేంద్రాల్లో కిచెన్ గార్డెన్లు ఏర్పాటు చేయాలన్నారు. కూరగాయలు, ఆకుకూరల మొక్కలు పెట్టేలా చూడాలని సూచించారు. రక్తహీనత పోషకాహార లోపంతో ఎవరూ ఇబ్బంది పడకుండా చూసుకోవాలని స్పష్టం చేశారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషకాహార పదార్థాలపై అవగాహన కల్పించేందుకు ప్రత్యేక ఉత్సవాలు నిర్వహించాలన్నారు. ఆహార పదార్థాలపై అవగాహన కల్పించేందుకు ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని సూచించారు. ఈ సమావేశంలో సీడీపీవోలు తదితరులు పాల్గొన్నారు.

పచ్చని చెట్లపై గొడ్డలి వేటు

- యథేచ్ఛగా నరికివేస్తున్న స్మగ్లర్లు
- పట్టించుకోని అధికారులు

సిరిసిల్ల రూరల్, సెప్టెంబరు 20 : మొక్కలను పెంచి పర్యావరణాన్ని కాపాడాలంటూ గత ప్రభుత్వం హరిత హారం పేరుతో లక్షలాది రూపాయలు ఖర్చు చేసింది. ఇందులో భాగంగా నాటిన మొక్కలు సంరక్షించడంతో చెట్లుగా పెరిగాయి. కానీ స్మగ్లర్లు ఆ చెట్లను టార్గెట్‌గా పెట్టుకొని యథేచ్ఛగా నరికి వేస్తున్నారు. కలపను అమ్ముకుంటున్నా అటవీశాఖ అధికారులు పట్టించుకోవడం లేదని ఆయా గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు. సిరిసిల్ల అర్బన్ పరిధి లోని సర్ధాపూర్, పెద్దూర్, పెద్దబోనాల, చిన్నబోనాల గ్రామాల శివారులో ఉన్న గుట్టలతోపాటు చిన్నపాటి అటవీ ప్రాంతాలు ఉండగా గతంలో అటవీశాఖ అధికారులు హరిత హారం కార్యక్రమంలో వేలాది మొక్కలను నాటి సంరక్షించి చెట్లుగా పెంచారు. పెరిగిన చెట్లను అటవీశాఖ అధికారులు పట్టించుకోకపోవడంతో స్మగ్లర్లు ఆ చెట్లపై కన్నేసి నరికేస్తున్నారు. ఎల్లారెడ్డిపేట మండలం వెంకటాపూర్ గ్రామానికి చెందిన కొందరు రాత్రి పూట చెట్లను నరికి వేస్తున్నారు. పొద్దంతా చెట్ల కొమ్మలను నరికి వేసి రాత్రిపూట సిరిసిల్ల పట్టణ శివారులో ఉన్న సామిల్‌లతోపాటు ఇటుక బట్టీలకు తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. సంబంధిత అధికారులకు తెలిసినా మామూలుగా తీసుకుంటున్నారని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా కలెక్టర్ స్పందించాలని, చెట్ల నరికివేతపై దృష్టి సారించాలని కోరుతున్నారు.



సిరిసిల్ల బైపాస్‌లో చెట్లను నరికి ట్రాక్టర్‌లో తరలిస్తున్న స్మగ్లర్లు



చెట్ల నరికివేతను అరికట్టాలి

- అదిపెల్లి శ్రీనివాస్‌గౌడ్ , పెద్దూర్

సిరిసిల్ల అర్బన్ పరిధిలోని పెద్దూర్ శివారులో ఉన్న ఎద్దు గుట్టతోపాటు అటవీ ప్రాంతంలో నిత్యం స్మగ్లర్లు చెట్లను నరికివేస్తున్నారు. రాత్రి పూట ట్రాక్టర్‌లలో తరలి స్తున్నారు. అటవీశాఖ అధికారులు పట్టించుకోవడం లేదు. కలెక్టర్ స్పందించి చెట్లను నరికివేతలను అరికట్టాలి.



ఇటుకబట్టీలు, సామిల్లకు తరలింపు

- బూర నరేష్‌కుమార్, రగుడు

సిరిసిల్ల అర్బన్ పరిధిలోని గ్రామాల శివారులో ఉన్న చెట్లను నరికివేసి చంద్రంపేట శివారులో ఏర్పాటు చేసిన ఇటుకబట్టీల తోపాటు సామిల్లకు తరలిస్తున్నారు. సంబంధిత అటవీశాఖ అధికారులు పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా దీనిపై జిల్లా కలెక్టర్ దృష్టి సారించాలి.

సైన్స్ ఫెయిర్‌లో శిశు మందిర్ విద్యార్థుల సత్తా



విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

వేములవాడ, సెప్టెంబరు 20: నాలుగు జిల్లాల స్థాయిలో కోరుట్ల పట్టణంలో నిర్వహిస్తున్న కరీంనగర్ విభాగ్ సైన్స్ ఫెయిర్‌లో వేములవాడ సరస్వతి శిశు మందిర్ విద్యార్థులు సత్తా చాటారు. సరస్వతీ శిశు మందిర్‌కు చెందిన మేరుగు ఆరాధన, కందుకూరి హాసిని, చిట్ల చందనశ్రీ, మంచకట్ల శివరాజ్, మంతెన హర్షిత ప్రథమ స్థానంలో, చిలుక మనస్విని, రోహిణి, కీర్తన ద్వితీయ స్థానంలో నిలిచారు. ఈ సందర్భంగా విద్యార్థులను పాఠశాల ఆచార్యుడు చిలుక గట్టు అభినందించారు. త్వరలో రాష్ట్ర స్థాయిలో హైదరాబాద్‌లో జరిగే సైన్స్ ఫెయిర్ లో పాల్గొంటారని తెలిపారు.

పత్తికుంటపల్లెలో ఉచిత వైద్యశిబిరం

ఇల్లంతకుంట, సెప్టెంబరు 20: మండలంలోని పత్తికుంటపల్లెలో ఉచిత వైద్యశిబిరం కొనసాగింది. జిల్లా వైద్యాధికారి ఆదేశాల మేరకు శుక్రవారం 75మందికి వైద్యపరీక్షలు నిర్వహించారు. గ్రామంలో జ్వరంతో బాధపడుతున్న అరుగిరికి మలేరియా నిర్ధారణ పరీక్షలు చేశారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని అప్పుడే వ్యాధులు ప్రబలవని అన్నారు. జ్వరలక్షణాలు కనిపిస్తే వైద్యసిబ్బందిని కలవాలన్నారు. ఈ కార్యక్రమంలో గాలిపల్లి వైద్యాధికారి కట్ట రమేష్, ఏఎన్ఎం కవిత, భారతి, లక్ష్మి, అనిత తదితరులు పాల్గొన్నారు

షార్ట్ సర్క్యూట్‌తో కాలిపోయిన సామగ్రి

గంభీరావుపేట, సెప్టెంబర్ 20 : గంభీరావుపేట మండల కేంద్రంలో బచ్చు కృష్ణమూర్తి ఇంట్లో గురువారం రాత్రి షార్ట్ సర్క్యూట్‌తో ఇంట్లోని, కిరాణాషాపులోని వస్తువులు కాలి బూడిదయ్యాయి. పెద్ద మొత్తంలో బంగారం, నగదు కూడ ప్రమాదంలో కాలిపోయినట్టు బాదితుడు తెలిపారు. దాదాపు 20 లక్షలకు పైగా నష్టం వాటిల్లినట్టు తెలిపాడు.

తాగునీటి సమస్యకు పరిష్కారం

తంగళ్లపల్లి, సెప్టెంబరు 20: తంగళ్లపల్లి మండలం చిన్న లింగాపూర్ ఎస్సీ కాలనీలో పనిచేయని బోరు మోటారు స్థానంలో కొత్తది బిగించడంతో తాగునీటి సమస్యకు పరిష్కారం లభించింది. ఎస్సీ కాలనీ వాసులు తాగునీటి కోసం ఇబ్బందులు పడుతున్న విషయాన్ని తెలుసుకున్న మాజీ ఎంపీటీసీ భైరనేని రాము తక్షణమే స్పందించారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో కార్యదర్శి నీరజ, స్పెషల్ ఆఫీసర్ అభిషేక్ కొత్త మోటారు తెప్పించి బిగించారు.

నాటుబాంబు పేలి గేదెకు గాయాలు

కోనరావుపేట సెప్టెంబరు 20: కోనరావుపేట మండలం ధర్మారం అటవీ ప్రాంతంలో గేదె మేస్తుండగా నాటుబాంబు పేలి మూతి భాగంలో గాయాలయ్యాయి. బాధిత రైతు వివరాల ప్రకారం.. ధర్మారం గ్రామానికి చెందిన మూడుకే మల్లయ్య తన గేదెలను అటవీ ప్రాంతంలోని పొలం వద్దకు మేత కోసం తీసుకెళ్లాడు. ఈ క్రమంలో అడవి జంతువులను వేటాడానికి పెట్టిన నాటుబాంబును ఓ గేదె మేస్తూ నమలడంతో పేలింది. ముఖం భాగం తీవ్ర గాయాలయ్యాయి. అడవి జంతువులను వేటాడడానికి పెట్టిన నాటుబాంబుతో తన గేదెకు తీవ్ర గాయాలయ్యాయని బాధిత రైతు వాపోయాడు. నాటు బాంబులను పెట్టిన వ్యక్తిని పట్టుకొని చర్యలు తీసుకోవాలని, పరిహారం ఇప్పించాలని కోరాడు.

విద్యార్థినులకు అసభ్యకర మెస్సేజ్‌లు

గంభీరావుపేట, సెప్టెంబరు 20: గంభీరావుపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంగ్లీష్, భౌతిక శాస్త్ర అధ్యాపకులు విద్యార్థినుల సెల్ ఫోన్లకు అసభ్యకర సందేశాలను పంపినట్లు తెలిసింది. విషయాన్ని విద్యార్థినులు తల్లిదండ్రులకు చెప్పడంతో విద్యార్థినుల తల్లిదండ్రులు, కొందరు ముఖ్య నేతలు కళాశాలకు వెళ్లి ఆ ఇద్దరు అధ్యాపకులను జరిగిన ఘటనపై ప్రశ్నించి తీవ్రంగా మందలించారు. తమది పొరపాటని అంగీకరించిన అధ్యాపకులు మరోసారి ఇలా జరగకుండా చూసుకుంటామన్నట్లు తెలిసింది. తప్పును ఒప్పుకుంటూ రాత పూర్వకంగా లెటర్ రాసి ఇచ్చినట్లు సమాచారం.

ముఖ్యమంత్రిని కలిసిన నేరెళ్ల బాధితులు

తంగళ్లపల్లి, సెప్టెంబరు 17: హైదరబాద్‌లోని సచివాలయంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని నేరెళ్ల బాధితులు శుక్రవారం కలిశారు. తమకు న్యాయం చేయాలని వేడుకున్నారు. గత ప్రభుత్వ హయాంలో పోలీస్ అధికారులు తమపై థర్డ్ డిగ్రీ ప్రయోగించి చిత్రహింసలకు గురి చేశారని వివరించారు. తమను చిత్ర హింసలకు గురి చేసిన ఐపీఎస్ విశ్వజిత్ కంపాటి, పోలీస్ అధికారి రవీందర్‌పై చర్యలు తీసుకోవాలని కోరారు. పోలీస్ దెబ్బలతో బాధపడుతున్న తమను పరామర్శించి న్యాయం చేస్తామని హామీ ఇచ్చిన విషయాన్ని గుర్తు చేసినట్లు నేరెళ్ల బాధితులు కొల హరిష్, పెంట బాణయ్య, పసుల ఈశ్వర్ తెలిపారు. ముఖ్యమంత్రి సానుకులంగా స్పందించినట్లు తెలిపారు. తమకు న్యాయం చేయడానికి కృషి చేస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, సిరిసిల్ల నియోజక వర్గ కాంగ్రెస్ పార్టీ నియోజక వర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.



సమస్యలు వివరిస్తున్న నేరెళ్ల బాధితులు

క్షేమంగా ఇంటికి చేరిన గల్ఫ్ బాధితుడు

సిరిసిల్లక్రైం, సెప్టెంబరు 20: సౌది అరేబియాలో అనారోగ్యం పాలై నరకయాతన అనుభవించిన సిరిసిల్ల పట్టణంలోని సిద్దులవాడకు చెందిన మహ్మద్ ఇమ్రాన్ (23) అనే యువకుడు క్షేమంగా ఇంటికి చేరాడు. గల్ఫ్ బాధితుడిని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ఆదుకున్నారు. ఇమ్రాన్ స్వదేశానికి వచ్చేందుకు అయ్యే విమాన టికెట్లు, ఇతర ఖర్చులను సమకూర్చారు. దీంతో అతడు 40 రోజుల్లో ఇంటికి చేరేందుకు పరిస్థితి సులభమైంది. గురువారం రాత్రి సౌదీ నుంచి బయలుదేరిన ఇమ్రాన్ హైదరాబాద్ విమానాశ్రయంలో దిగి సిరిసిల్లకు వచ్చాడు. సిరిసిల్ల పట్టణానికి చెందిన ఇమ్రాన్ ఉపాధికోసం సూపర్‌మార్కెట్‌లో పని ఉందని 45 రోజుల కిందట సౌదీ అరేబియా వెళ్లాడు. 15 రోజుల క్రితం అక్కడ ఫైల్స్ సర్జరీ చేయించుకున్నాడు. ఆపరేషన్ చేయించుకున్నా ఆరోగ్యం కుదుట పడకపోవడంతో తనను స్వదేశానికి పంపించాలని యాజమాన్యాన్ని కోరాడు. అయినప్పటికీ స్వదేశానికి పంపించకుండా తనను కొడుతున్నారని, చంపేస్తామని బెదిరిస్తున్నారని, ఏజెంట్ చెప్పిన పనికాకుండా అక్కడ మరో పనిచేయిస్తున్నారని, తనకు ఆరోగ్యం బాగాలేదని, తనను కాపాడాలని, సౌదీ నుంచి స్వదేశానికి రప్పించాలని, సెల్ఫీ వీడియో ద్వారా సీఎంకు, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌కు విజ్ఞప్తి చేశాడు. ఆ యువకుడి ఆవేదనకు స్పందించి సౌదీలోని ఇండియన్ ఎంబీసీకి లేఖ రాశారు. అధికారులతో ఫోన్‌లో మాట్లాడి అనారోగ్యంతో ఉన్న ఇమ్రాన్‌ను వెంటనే ఇండియాకు రప్పించేందుకు ఆది శ్రీనివాస్ తగిన చర్యలు తీసుకున్నారు. ఎన్ఆర్ఐ భైరా దేవ్ యాదవ్ గల్ఫ్ బాధితుడు ఇమ్రాన్ వద్దకు వెళ్లి స్వదేశానికి పంపించేందుకు ఏర్పాట్లు చేశాడు. స్వదేశానికి రప్పించేందుకు కృషిచేసిన ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌కు, ఎన్ఆర్ఐ భైరాదేవ్ యాదవ్‌కు బాధితుడి కుటుంబసభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

మాదక ద్రవ్యాల నిర్మూలనపై అవగాహన ర్యాలీ



వేములవాడలో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

వేములవాడ, సెప్టెంబరు 20 : మాదక ద్రవ్యాల నిర్మూలనపై వేములవాడ ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎన్ఎస్ఎస్ విద్యార్థి విభాగం, సోషల్ జస్టిస్ ఫర్ ఓల్డ్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం వేములవాడ పట్టణంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ శేఖర్ ఈ సందర్భంగా మాట్లాడుతూ మాదక ద్రవ్యాల వినియోగంతో విద్యార్థులు విలువైన సమయంతోపాటు భవిష్యత్ కూడా దెబ్బతింటుందన్నారు. మాదకద్రవ్యాలు దరిచేరకుండా చూడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ వి. అంజయ్య, అధ్యాపకులు మహేందర్ రెడ్డి, భరత్, సంతోష్, మహేందర్, దేవయ్య, అశోక్, రవీందర్, గోపి, శ్రీనివాసరావు, లత, మంగమ్మ, స్వప్న, జ్యోతి, దీపిక, సోషల్ జస్టిస్ ఫర్ వరల్డ్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ సభ్యులు పాల్గొన్నారు.

సీపీఎస్‌ను రద్దు చేసి ఓపీఎస్‌ను అమలు చేయాలి

చందుర్తి, సెప్టెంబరు 20: సీపీఎస్‌ను రద్దు చేసి ఓపీఎస్‌ను అమలు చేయాలని తపస్ రాష్ట్ర కార్యదర్శి వోడ్నాల జగన్ మోహన్ అన్నారు. చందుర్తి మండ లంలో వివిధ గ్రామాల్లోని పాఠశాలల్లో శుక్రవారం తపస్ సభ్యత్వ అభియాన్ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో ప్రకటించినట్లు సీపీఎస్ విధానాన్ని రద్దు చేయాలని, పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న డీఏలు వెంటనే విడుదల చేయాలని, డీఏ బకాయిలు ఏక మొత్తంలో ఇవ్వాలని అన్నారు. నగదు రహిత ఎంప్లాయి హెల్త్ స్కీమ్‌ని అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు గసికంటి శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి జయకృష్ణ, బాలకిషన్, అమరేందర్ పాల్గొన్నారు.



సభ్యత్వం స్వీకరిస్తున్న ఉపాధ్యాయులు

మార్కెట్ కమిటీల పాలకవర్గాలు

సిరిసిల్ల, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని మార్కెట్ కమిటీల పాలకవర్గాలను నియమిస్తూ ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. సిరిసిల్ల మార్కెట్ కమిటీ చెర్‌పర్సన్‌గా వేముల స్వరూప, వైస్ ఛైర్మన్‌గా నేరెళ్ల నర్సయ్య, వీర్నపల్లి మార్కెట్ కమిటీ ఛైర్మన్‌గా లకావత్ రాములు, వైస్ ఛైర్మన్‌గా లెంకల లక్ష్మణ్, ఎల్లారెడ్డిపేట రాచర్ల బొప్పాపూర్ మార్కెట్ కమిటీ ఛైర్ పర్సన్‌గా షేక్ షబ్బీర్ బేగం, వైస్ ఛైర్మన్‌గా రాంరెడ్డి, గంభీరావుపేట మార్కెట్ కమిటీ ఛైర్ పర్సన్‌గా కొమిరిశెట్టి విజయ, వైస్ ఛైర్మన్‌గా అంజిరెడ్డి, ముస్తాబాద్ పోతుగల్ మార్కెట్ కమిటీ ఛైర్‌పర్సన్‌గా తలారి రాణి, వైస్ ఛైర్మన్‌గా వేముల రాంరెడ్డిని నియమించింది.

విద్యార్థికి మెరుగైన వైద్యం అందించాలి

ఎల్లారెడ్డిపేట, సెప్టెంబరు 20: పాముకాటుకు గురైన ఇల్లంతకుంట మండలం గాలిపల్లి బీసీ సంక్షేమ పాఠశాలలోని ఆరో తరగతి విద్యార్థి రమావత్ రోహిత్‌కు ప్రభుత్వం మెరుగైన వైద్యం అందించాలని ఎస్ఎఫ్ఐ, ఏబీవీపీ, బీఆర్ఎస్ విద్యార్థి విభాగం నాయకులు డిమాండ్ చేశారు. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థి రోహిత్ ఆరోగ్య పరిస్థితిని శుక్రవారం తెలుసుకున్నారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ సంక్షేమ వసతి గృహాలు, పాఠశాలల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. మేడిపల్లి రూరల్ మండలం పెద్దాపూర్ గురుకులంలో పాము కాటుతో విద్యార్థులు మృతి చెందిన ఘటనల నుంచి తేరుకోక ముందే ఇల్లంతకుంట మండలం గాలిపల్లిలో విద్యార్థి పాముకాటుకు గురవడం దారుణమన్నారు. ప్రభుత్వం విద్యార్థుల సంక్షేమాన్ని గాలికి వదిలేసిందని ధ్వజమెత్తారు. విద్యార్థి పాము కాటుకు గురై ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నా కలెక్టర్, ఉన్నతాధికారులు స్పందించకపోవడం అన్యాయమన్నారు. సంక్షేమ పాఠశాలలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన వారిపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలన్నారు. నిరుపేద విద్యార్థి రోహిత్‌కు ప్రభుత్వమే మెరుగైన వైద్యం అందించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో విద్యార్థుల పక్షాన ఆందోళనలకు దిగుతామని హెచ్చరించారు. నాయకులు రంజిత్‌కుమార్, రవి, అనిల్, ప్రశాంత్, మహేశ్, రాకేశ్, సాయిభరత్ తదితరులు ఉన్నారు.

లేబర్ కార్డుల జీవోను అమలు చేయాలి

కోనరావుపేట సెప్టెంబరు 20: లేబర్ కార్డుల జీవోను అమలు చేయాలని భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కదారి రాములు అన్నారు. కోనరావుపేటలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో శుక్రవారం మాట్లాడారు. గతంలో ప్రభుత్వం అమలు చేసిన లేబర్ కార్డుల జీవ ప్రకారం ప్రమాదవశాత్తు మరణిస్తే రూ.6 లక్షలు, సహజ మరణానికి లక్ష రూపాయలు అందించే విధంగా జీవో అమలైందన్నారు. బీజేపీ ప్రభుత్వం లేబర్ కార్డులను ప్రైవేటుపరం చేసే కుట్రలు చేస్తోందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి ప్రభుత్వ రంగంలోనే ఉండేలా చూడాలని కోరారు. ఈ సందర్భంగా కోనరావుపేట సుతారి సంఘం పట్టణ కార్యదర్శి బొల్లె బాబు, శ్రీనివాస్, రాజన్న, శంకర్, శ్రీనివాస్, దేవయ్య తదితరులు ఉన్నారు.

వేములవాడలో పెరుగుతున్న దొంగతనాలు

వేములవాడ, సెప్టెంబరు 20: వేములవాడ పట్టణంలో కొంతకాలంగా చిల్లర దొంగతనాలు పెరిగిపోతున్నాయి. పట్టణంలోని వివిధ ప్రాంతాలలో నిర్మాణంలో ఉన్న భవనాల వద్ద ఉండే విలువైన వస్తువులను ఎత్తుకుపోయే సంఘటనలు ఎక్కువవడం ఆందోళన కలిగిస్తోంది. పట్టణంతో పాటు శివారు ప్రాంతాల్లోని నిర్మాణాల్లో ఉన్న భవనాలలో నిర్మాణం కోసం తీసుకొచ్చిన విలువైన వస్తువులు, కరెంటు వైర్లు ఇతరత్రా సామగ్రిని చోరీ చేస్తున్నారు. సుబ్రహ్మణ్యనగర్‌లోని నిర్మాణంలో ఉన్న భవనంలో దాదాపు లక్ష రూపాయల విలువైన సామగ్రిని గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకుపోగా బాధితులు పోలీసులను ఆశ్రయించారు.

అగ్ని ప్రమాదాలపై అవగాహన అవసరం

రుద్రంగి, సెప్టెంబరు 20: విద్యార్థులలు అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన కలిగి ఉండాలని, చుట్టు పక్కల వారిని చైతన్యవంతులుగా చేసి ప్రమాదాలను నివారించ వచ్చనని అగ్నిమాపక శాఖాధికారి అనిల్ కుమార్ అన్నారు. మండల కేంద్రంలోని కృష్ణవేణి టాలేంట్ స్కూల్‌ను అగ్నిమాపక సిబ్బంది పరిశీలించి, విద్యార్థులకు అగ్నిమాపక పరికరాలు, ప్రమాదాలపై అవగాహన వివరించారు. ప్రిన్సిపాల్ హరినాథ్‌రాజు పాల్గొన్నారు.

పంటల సాగుపై రైతులకు అవగాహన

రుద్రంగి, సెప్టెంబరు 20: రుద్రంగి మండల కేంద్రంలోని రైతు వేదికలో పంటల సాగుపై రైతులకు బాబు జగ్జీవన్ రామ్ వ్యవసాయ కళాశాల ఫైనల్ ఇయర్ విద్యార్థులు శుక్రవారం అవగాహన కల్పించారు. గ్రామీణ వ్యవసాయ కృషి అనుభవ కార్యక్రంలో భాగంగా పలు వ్యవసాయ క్షేత్రాలను పరిశీలించారు. లాభాలపై రైతులకు వివరించారు. ఈ సందర్భంగా రైతు వేదిక ఆవ రణలో వ్యవసాయంలో తీసుకోవాల్సిన మెళకువలపై వివరించారు. రుద్రంగి మండలంలో ఎక్కువ మొత్తంలో వరి, మానాలలో పత్తి సాగు చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈవో జ్యోతి, కార్యదర్శి రాందాస్, తర్రె మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులపైనే దేశ భవిష్యత్

ఎల్లారెడ్డిపేట, సెప్టెంబరు 20: చదువుకుంటే ప్రపంచమే మోకరిల్లుతోందని, విద్యార్థులపైనే దేశ భవిష్యత్ ఆధార పడి ఉంటుందని బహుభాషా కోవిదుడు, కాళోజీ అవార్డు గ్రహీత నలిమెల భాస్కర్ అన్నారు. ఎల్లారెడ్డిపేట మండలం నారాయణపూర్‌లో నారాయణపురం సేవా సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శ్రీరామ గ్రంథాలయాన్ని మాజీ ప్రభుత్వ సలహాదారు, విశ్రాంత కలెక్టర్ కేవీ రమణాచారి, దాశరథి అవార్డు గ్రహీత శ్రీనివాసాచారితో కలిసి శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా భాస్కర్ మాట్లాడుతూ విద్యార్థులు సెల్‌ఫోన్లకు దూరంగా ఉండాలన్నారు. పట్టుదల, అకుంఠిత దీక్షతో ముందుకు సాగి అనుకున్న లక్ష్యాన్ని చేరుకోవాలన్నారు. ఉన్నత స్థాయిలో ఉన్న వారిని ఆదర్శంగా తీసుకోవాలన్నారు. గ్రామంలో కేవీ రమణాచారి తండ్రి రాఘవచార్యులు, మురలయ్య 1949లో గ్రంథాలయాన్ని ఏర్పాటు చేశారని గుర్తు చేశారు. తాను 1969లో ఆ గ్రంథాలయంలో అడుగు పెట్టి నవలలను మొత్తం చదివి తొమ్మిదో తరగతిలోనే నవల రాసినట్లు చెప్పారు. చదువుతోపాటు సాహిత్యం, సం స్కారం నేర్చుకోవాలన్నారు. సింప్లింగ్ సిట్టింగ్ మంత్లీ గెట్టింగ్ అనే విధానంతో కాకుండా ఉపాధ్యాయులు త్రికరణ శుద్ధితో విద్యార్థులకు విద్యాబోధన చేయాలన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌తోపాటు తెలంగాణ రాష్ట్రంలో వివిధ హోదాల్లో కేవీ రమణాచారి చేసిన సేవకు పద్మశ్రీ అవార్డు రావాలన్నారు. ఆయన అవార్డుల కోసం ఎదురు చూడలేదని ప్రజా సేవే ముఖ్యంగా ముందుకు సాగారని అన్నారు. ఉపాధ్యాయులు, అధికారులు, రాజకీయ నాయకులు స్వార్థం లేకుండా సేవ చేసినప్పుడే ప్రజాస్వామ్యం బలపడి విద్యా వ్యవస్థ సుస్థిరంగా ద్రుఢమవుతుందన్నారు.



నలిమెల భాస్కర్‌ను సన్మానిస్తున్న కేవీ రమణాచారి

ఉన్నత స్థాయిలో నిలిచిన వారిని ఆదర్శంగా తీసుకోవాలి

విద్యార్థులు ఉన్నత స్థాయిలో నిలిచిన వారిని ఆదర్శంగా తీసుకోవాలని మాజీ ప్రభుత్వ సలహాదారు, విశ్రాంత కలెక్టర్ కేవీ రమణాచారి అన్నారు. విద్యార్థులకు అన్ని వసతులతో కూడిన విద్య అందుతోందన్నారు. గ్రామంలో గ్రంథాలయం ఉండాలనే లక్ష్యంతో నారాయణపురం సేవా సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. విద్యార్థులకు చదువుకొని ఉన్నత స్థితికి చేరుకోవాలనే పట్టుదల ఉండాలన్నారు. తాము చెట్ల కింద చదువుకున్న రోజులున్నాయని గుర్తు చేశారు. నారాయణపూర్‌లో పుట్టి విద్యనభ్యసించిన ఎందరో వివిధ రంగాల్లో ఉన్నత స్థాయికి చేరుకున్నారన్నారు. గతంలో ఉమ్మడి కుటుంబాలుండేవని, ప్రస్తుతం ఎక్కడ కనిపించడం లేదని అన్నారు. ఉమ్మడి కుటుంబాలతో బంధాలు, బాంధవ్యాలు బలంగా ఉండేవన్నారు. విద్యార్థులు చదువుకొని ఊరుకు పేరు తీసుకురావాలన్నారు. అనంతరం కాళోజీ అవార్డు గ్రహీత నలిమెల భాస్కర్‌ను ఘనంగా సన్మానించారు. గ్రంథాలయం కోసం కేవీ రమణాచారి రూ.లక్ష, గ్రామ వాస్తవ్యుడు పాత లింగన్న రూ.99,999తోపాటు పలువురు నగదును అంద జేశారు. అంతకు ముందు గ్రామంలోని సీతారామచంద్రస్వా మి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమం లో దాశరథి అవార్డు గ్రహీత శ్రీనివాసాచారి, ప్రొఫెసర్ శివారెడ్డి, రంగినేని ట్రస్ట్ నిర్వాకులు మోహన్‌రావు, నాయబ్ తహసీల్దార్ గోపాల్, హెచ్ఎంలు మనోహరాచారి, చంద్రశేఖర్, సంస్థ సభ్యులు లింగన్న, నారాయణరెడ్డి, కిషన్ రావు, సుధాకర్‌రావు, దేవిరెడ్డి, విశ్వనాథం, దేవారెడ్డి, సుదర్శన్, సత్యనారాయణ, అశోక్‌కుమార్, రాజగోపాల్ పాల్గొన్నారు.

ఘనంగా మిలాద్ ఉన్ నబీ

సిరిసిల్ల రూరల్, సెప్టెంబరు 20: సిరిసిల్ల పట్టణంలో జామా మసీద్ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం మిలాద్ ఉన్ నబీ నిర్వహించారు. పట్టణంలోని జామా మసీద్ నుంచి యూత్ ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ చేపట్టారు. సాయంత్రం మసీద్ కమిటీ ఆధ్వర్యంలో చేపట్టిన, ప్రదర్శన ర్యాలీ పెద్దబజార్, పాత బస్టాండ్, అంబేద్కర్ చౌరస్తా, గాంధీచౌక్‌ల మీదుగా బాబా సాహోలీ దర్గా వరకు సాగింది. మసీద్ కమిటీ అధ్యక్షుడు ఎండీ సలీం, మాజీ అధ్యక్షులు యూసుఫ్, సత్తార్, నాయకులుఉస్మాన్, రఫీ, ఇస్మాయిల్, అన్వర్, ఖాజా, మోసీన్, ఫయాజ్, అఫ్రల్ పాల్గొన్నారు.

● మహ్మద్ ప్రవక్త బోధించిన సూత్రాలను ముస్లింలు తప్పకుండా పాటించాలని, ఆయన పుట్టిన రోజు సందర్భంగా కార్యక్రమాలను చేపట్టాలని మత గురువులు మహ్మద్ ఆసిఫ్, ముగ్గం మోయినుద్దీన్ కోరారు. సిరిసిల్ల పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో జామా మసీద్ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి మహ్మద్ ప్రవక్త జన్మదినం సందర్భంగా మిలాద్ ఉన్ నబీలో భాగంగా చేపట్టిన బహిరంగ సభకు సిద్దిపేటకు చెందిన మత గురువు మహ్మద్ ఆసిఫ్, వరంగల్‌కు చెందిన ఆల్ ఇండియా రేడియో కళాకారుడు, మత గురువు ముగ్ధం మోయినుద్దీన్‌లు హాజరయ్యారు. నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. ఆయన జన్మదినం సందర్భంగా ముస్లింలు, భక్తితో మిలాద్ ఉన్ నబీ పండుగను అత్యంత భక్తి శ్రద్ధలతో జరుపుకోవడంతోపాటు ర్యాలీలు నిర్వహించి అన్నదానాలు, స్వీట్లను పంపిణీ చేయాలని సూచించారు. జామా మజీద్ మౌలానా అబ్దుల్ గనీ, అధ్యక్షుడు ఎండీ సలీం, మాజీ అధ్యక్షులు యూసుఫ్, ఎండీ సత్తార్, నాయకులుఉస్మాన్, రఫీ, ఇస్మాయిల్, అన్వర్, ఖాజా, మోసీన్, ఫయాజ్, అఫ్రల్, సిరిసిల్ల ఫ్రెండ్స్ గ్రూప్ సభ్యులు సయ్యద్ షాదాబ్, అమ్ము, అఫ్రోజ్ పాల్గొన్నారు.



సిరిసిల్లలో ర్యాలీ నిర్వహిస్తున్న ముస్లింలు

ఇల్లంతకుంట: మండలకేంద్రంలో ముస్లింలు శుక్రవారం మిలాద్ ఉన్ నబీ ర్యాలీ నిర్వహించారు. జమామసీదు నుంచి ప్రారంభమైన ర్యాలీ బస్టాండ్ మీదుగా కొనసాగింది. ఎస్సై శ్రీకాంత్‌గౌడ్ బందోబస్తు నిర్వహించారు. ర్యాలీలో నయీం, అసీఫ్‌రజా, అజీం, మొబీన్, భాషు ఖలీల్, సాదిక్, సమీర్, సుమేర్, నవాబ్, ఫయిం తదితరులు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డిపేట: మిలాద్ ఉన్ నబీ వేడుకలను పురస్కరించుకుని ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో ముస్లిం కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం భారీ ప్రదర్శన నిర్వహించారు. స్థానిక మసీదు నుంచి పురవీధుల గుండా ర్యాలీ కొనసాగింది. కార్యక్రమంలో నాయకులు లాల్‌మహ్మద్, రఫీక్, తాజ్, మజీద్, హైమద్ తదితరులు పాల్గొన్నారు